1

నవతెలంగాణ

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

గురువారం 2 ఫిబ్రవరి 2023



పొద్దుతిరుగుడు సాగులో యాజమాన్య పద్ధతులపై శిక్షణ



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్: పొద్దుతిరుగుడు సాగులో అధిక దిగుబడుల కోసం మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని సర్పంచ్ సదాశివరెడ్డి అన్నారు. బుధవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని బుస్సాపూర్ గ్రామంలో వ్యవసాయ పరిశోధన స్థానం, తోర్నాల, కోరోమండాల్ ఫెర్టిలైజర్ ఆధ్వర్యంలో పొద్దుతిరుగుడు సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త శ్వేత మాట్లాడుతూ పంట పూత దశలో బోరాక్స్ 0.2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. శాస్త్రవేత్త సాయినాథ్ మాట్లాడుతూ నూనెగింజల పంటలో సూక్ష్మ పోషకాల ప్రాధాన్యత, పోషక యాజమాన్య పద్ధతులను వివరించారు. శాస్త్రవేత్త ఉమారాణి మాట్లాడుతూ ప్రొద్దుతిరుగుడులో రసం పీల్చే పురుగు నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా థయోమిథక్సమ్ 0.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి ప్రేమ్ సాయి, అవినాష్, సంతోష్, అశోక్ పాల్గొన్నారు.

ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పనులపై రివ్యూ మీటింగ్



నవ తెలంగాణ-దుబ్బాక

ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పనులకు కూలీలను పెంచాలని, గ్రామాల్లో చేపడుతున్న పనుల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్లైన్‌లో నమోదు చేయాలని డీఆర్డీఏ పీడీ గోపాల్‌రావు అధికారులను ఆదేశించారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో దుబ్బాక, మిరుదొడ్డి, తొగుట మండలాల ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఏపీవోలు, పంచాయతీ సెక్రటరీలు, ఎఫ్ఏలు, ఈజీఎస్ సిబ్బందితో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. వితంతు పెన్షన్ల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. గ్రామాల్లో 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసున్న 5వ తరగతి వరకు చదివి ఉద్యోగం లేని నిరుద్యోగులకు ఎల్అండ్‌టీ సంస్థ ద్వారా ఉచిత శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించే దిశగా శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవోలు వి.భాస్కర శర్మ రాజిరెడ్డి, శ్రీధర్, ఎంపీఓలు, ఏపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి మెదక్ జిల్లాకు.. నిరాశే

- నిమ్జ్‌లో మౌలిక వసతులకు నిధులేవి
- సంగారెడ్డి-జోగిపేట రైల్వేలైన్ ప్రస్తావనలేదు
- ఏదులనాగులపల్లిలో రైల్వే టర్మినల్ నో
- కాళేశ్వరానికి జాతీయ హెూదా హులక్కే
- సంగారెడ్డి వరకు మెట్రోలైన్ ఊసెత్తలే



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ బుధవారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి మెదక్ జిల్లాకు మొండి చెయ్యి చూపారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి రూ.45,03,097 కోట్లతో ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంకెల కూర్పును కార్పొరేట్ల లాభాల పద్దుగా మార్చారు. పేదలులేని దేశంగా తీర్చిదిద్దుతామని గొప్ప డైలాగ్‌లతో పెట్టిన బడ్జెట్ ప్రజల ఆశల్ని నెరవేర్చేదిగా లేదని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. ఉత్పత్తి రంగానికి తగిన నిధులివ్వకుండా పేదరిక నిర్మూలనకు తోడ్పడే పథకాలకు నిధులు పెంచకుండా దేశం ముందడుగు వేయదనే సత్యాన్ని కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని వామపక్షాలు అభిప్రాయపడుతున్నాయి. రైతులు, కార్మికులు, కర్షకులు, సామాజిక వర్గాల ప్రజల ఆశలు నీరుగార్చేలా నిధులు కేటాయింపులు జరిగాయని ప్రజా సంఘాల నేతలు విశ్లేషిస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు కావాల్సిన రైల్వేలైన్ల విస్తరణ, టర్మినల్, ఫ్లైవోవర్ బ్రిడ్జీలు, మెట్రో లైన్ విస్తరణ, నిమ్జ్‌లో మౌలిక వసతుల కల్పన, పలు అభివృద్ధి పనులకు నిధులు, కేంద్రీయ, నవోదయ విద్యాలయాల ఏర్పాటు వంటి అంశాల్లో నిరాశే ఎదురైంది. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో పలు అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాలని సీపీఐ(ఎం) అనేక పోరాటాలు చేస్తూ వస్తోంది. బీఆర్ఎస్ ఎంపీలు బీబీపాటిల్, కొత్త ప్రభాకర్‌రెడ్డి సైతం పార్లమెంట్‌లో సమస్యల్ని ప్రస్తావించడం, ప్రధాని, ఇతర మంత్రులకు లేఖలు రాయడం, వినతులు చేస్తూ వచ్చారు. ప్రతి బడ్జెట్ సందర్భంగా ఎన్నో కొన్ని నిధులొస్తాయని ఎదురు చూడడం తప్ప కేంద్రం విదిల్చిందిలేదు. ఎన్నికల బడ్జెట్‌లోనైనా నిధులిస్తారనుకుంటే దేనికీ ప్రాధాన్యత లభించలేదు. ముఖ్యంగా రైల్వే లైన్ల విస్తరణకు బడ్జెట్‌లో గుంపగుత్తగా నిధులు కేటాయించినప్పటికీ ఉమ్మడి మెదక్ జిల్లాలో పలాన ప్రాజెక్టుకు నిధులిస్తున్నట్లు ప్రకటించలేదు. సంగారెడ్డి-జోగిపేటకు కొత్త రైల్వేలైన్ కోసం రూ.1800 కోట్ల నిధులు కావాలి. ఈ బడ్జెట్‌లో ఆ ప్రస్తావనలేదు. పటాన్‌చెరు నియోకవర్గంలో ఏదులనాగులపల్లిలో రైల్వే టర్మినల్‌ను ఏర్పాటు చేయాల్సి ఉన్నా పట్టించుకోలేదు. తెల్లాపూర్‌లో రైల్వే ఓవర్ బ్రిడ్జి గురించి కూడా లేదు. మనోహారాబాద్-కొత్తపల్లి రైల్వే లైన్‌కు నిధులు సరిగ్గా ఇవ్వని పరిస్థితి ఉంది. ముంబయి-జహీరాబాద్-హైదరాబాద్ బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుకు నిధులివ్వాలనే డిమాండున్నా పెద్దగా ప్రాధాన్యత ఇవ్వలేదు. పటాన్‌చెరు-ఆదిలాబాద్ మధ్య 318 కిలో మీటర్ల రైల్వేలైన్ ఏర్పాటు కూడా కేంద్రం నిధులివ్వలేదు. సంగారెడ్డి జిల్లాలో నిమ్జ్ ప్రాజెక్టుకు సరిపడ నిధుల్లేకపోవడంతో ముందడుగు పడట్లేదు. మౌలిక సదుపాయాల కల్పన కోసం కేంద్రం నిధులు కేటాయించాలి. నిమ్జ్‌కు రూ.550 కోట్ల నిధులు కేటాయించాలని ఐటీ మంత్రి కేటీఆర్ పలుమార్లు లేఖలు రాశారు. అయినా బడ్జెట్‌లో పెద్దగా నిధులు రాలేదు. సంగారెడ్డి జిల్లాలో మియాపూర్ నుంచి సంగారెడ్డి టౌన్ వరకు మెట్రో లైన్‌ను విస్తరించాలని డిమాండ్ ఉంది. ఈ మేరకు సీపీఐ(ఎం) పలుమార్లు ఆందోళనలు చేసింది. బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు సైతం కేంద్రానికి లేఖలు రాశారు. కేటీఆర్ ప్రధాన మంత్రిని కోరారు. అయినా మెట్రో విస్తరణకు నిధులివ్వలేదు. వీటితో పలు జాతీయ రహదారుల విస్తరణకు నిధులివ్వాల్సిన కేంద్రం బడ్జెట్‌లో విస్మరించింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హెూదా ప్రస్తావనలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి మెదక్ జిల్లాలో లక్షలాది ఎకరాలు సాగులోకి వస్తున్నాయి. ధాన్యం, ఇతర పంటల దిగుబడులు భారీగా పెరుగుతున్నాయి. ఆ ప్రాజెక్టుకు జాతీయ హెూదా ఇస్తే అట్టి నిధులతో ఫుడ్ ప్రాసెస్, ఇతర పరిశ్రమలు నెలకొల్పేందుకు వీలవుతుందని రాష్ట్ర మంత్రులు పేర్కొంటున్నారు. కొత్తగా ఏర్పడిన జిల్లాలో కేంద్ర విద్యా సంస్థల్ని ఏర్పాటు చేయాలని విభజన చట్టంలో పేర్కొనబడింది. అందులో భాగంగా కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా మెదక్, సంగారెడ్డికి మంజూరు చేయలేదు. దేశంలో వందల సంఖ్యలో మెడికల్ కళాశాల్ని మంజూరు చేస్తున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఇప్పటికే సిద్దిపేట, సంగారెడ్డి మెడికల్ కళాశాల్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మెదక్ జిల్లాలో మెడికల్ కళాశాల మంజూరు చేయాలనే డిమాండ్ ఉంది. జాతీయ రహదారి 65, ఇతర రహదారుల విస్తరణ పనులకు కూడా నిధులివ్వాలని జిల్లాకు చెందిన మంత్రి హరీశ్‌రావు పలుమార్లు కోరారు.

ఉత్పత్తి రంగానికి ప్రాధాన్యతేదీ?



బడ్జెట్‌లో అప్పులు, వడ్డీలంటూ పద్దులు పొందిపర్చిన కేంద్ర ప్రభుత్వం మాటల్లో మాత్రం పేదరిక నిర్మూలన గురించి గొప్పలు చెప్పడం విడ్డూరంగా ఉంది. ఆకలి, పేదరికం, విద్య, ఆరోగ్యం వంటి విభాగాల్లో ప్రపంచ దేశాల్లో కింది వరసలో ఉన్న దేశాన్ని ఎలా ముందుకు తీసుకెళ్తారనేది బడ్జెట్ ప్రస్తావనలో లేదు. ఉత్పత్తి రంగానికి ప్రాధాన్యత లేదు. ప్రభుత్వ రంగ పరిశ్రమలు, వివిధ సంస్థల్ని పరిరక్షించి మరింత విస్తరించాల్సిన ప్రభుత్వం వాటిని అప్పనంగా కార్పొరేట్లకు అమ్మకానికి పెట్టింది. ఎల్ఐసీ, విశాఖ స్టీల్, బీహెచ్ఈఎల్, ఓడీఎఫ్, బీడీఎల్ వంటి సంస్థల్ని నిర్వీర్యం చేయడమే కాకుండా ప్రయివేటీకరిస్తుంది. బడ్జెట్‌లో పేదల అభివృద్ధి, రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర చట్టం, మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ల వంటి విషయాల్ని కేంద్రం విస్మరిస్తుంది. అంకెల గారడీ చేయడం తప్ప పేదలు, మధ్య తరగతి ప్రజలకు మేలు చేకూర్చే విషయాలేవీ బడ్జెట్‌లో లేవు. సంగారెడ్డి లాంటి పారిశ్రామిక ప్రాంత అభివృద్ధి, సంగారెడ్డి-జోగిపేట రైల్వేలైన్, మియాపూర్-సంగారెడ్డి వరకు మెట్రో విస్తరణ వంటి విషయాల్ని పట్టించుకోలేదు.

- గొల్లపల్లి జయరాజు, సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి

పేదల్ని విస్మరించిన కేంద్ర బడ్జెట్



పేదల్ని విస్మరించి సంపన్నుల ప్రయోజనం కోసమే బడ్జెట్‌ను రూపొందించారు. ఏడేళ్లుగా అంకెల గారడీ చేసినట్లే ఈసారి కూడా అదే కొనసాగింది. వెనుకబడిన మెదక్ జిల్లాకు ఒక్క మేలు చేకూరలేదు. రైల్వే లైన్లు, రహదారులు, కేంద్రీయ విద్యా సంస్థలు, మెడికల్ కళాశాల కావాలనే ప్రజల డిమాండ్లను కేంద్రం పట్టించుకోలేదు. దేశ వ్యాప్తంగా అమలయ్యే ఉపాధి హామీ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకాలకు కూడా నిధులు తగ్గించారు. దీంతో పేదలకందే ప్రయోజనాలు దెబ్బతింటాయి. వ్యవసాయ రంగానికి పెద్దగా నిధులేమీ ఇవ్వలేదు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ఏం చేస్తారనేది చెప్పలేదు. వ్యవసాయం, విద్య, వైద్యం, ఉపాధి రంగాలను విస్మరించిన కేంద్రం పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత గురించి మాట్లాడడం వింతగా ఉంది. ఎన్నికల బడ్జెట్‌పై ప్రజల్లో ఎన్నో ఆశలుంటాయి. బడ్జెట్ రూపకల్పనలో వాటిని పట్టించుకున్నట్టులేదు. కార్పొరేట్ల ప్రయోజనాలు, అప్పులు, వడ్డీలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. ఇది పేదలకు ప్రయోజనం లేనిబడ్జెట్.

- ఎ.మల్లేశం, సీపీఐ(ఎం) మెదక్ జిల్లా కార్యదర్శి

ప్రజా వ్యతిరేక బడ్జెట్



కేంద్ర బడ్జెట్ ప్రజా వ్యతిరేకంగా ఉంది. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసినట్లు చెప్పడం తప్ప ఎంఎస్‌పీ చట్టం గురించి చెప్పలేదు. పెరిగిన ఎరువులు, పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపు గురించి మాట్లాడలేదు. అప్పులు చేసి వడ్డీలు కడుతున్న కేంద్రం ఆ డబ్బులతో ఏ కొత్త ప్రాజెక్టు కట్టిందిలేదు. ప్రజలకు ప్రయోజనం చేకూర్చే పథకాలేవీ తీసుకురాలేదు. దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టి ప్రపంచ కుబేరుల్ని చేయడం తప్ప దేశానికి మోడీ చేసిందేమీలేదు. బడ్జెట్ వల్ల పేదలు, మధ్య తరగతి ప్రజలకు అదనంగా ఒనగూరే ప్రయోజనం లేకపోగా అందుతున్న సబ్సిడీలు, ప్రయోజనాలను తగ్గించారు. సిద్దిపేట జిల్లాకు రైల్వేలైన్లు, రహదారులు, ప్రాజెక్టులకు అవసరమైన నిధుల్విడంలో కేంద్రం వివక్ష చూపింది. ప్రజల ద్వారా వచ్చే పన్నుల ఆదాయాన్ని తిరిగి ప్రజల అభివృద్ధి, అవసరాల కోసం కేటాయించాలి. మోడీ అందుకు విరుద్ధంగా పన్నుల ఆదాయాన్ని సంపన్నులైన పెట్టుబడిదారుల లాభాలకు వెచ్చిస్తున్నాడు. కేంద్ర బడ్జెట్ ప్రజా వ్యతిరేకంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం పేదలను విస్మరిస్తోంది.

- ఆముదాల మల్లారెడ్డి, సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి

కార్పొరేట్లకు అనుకూల బడ్జెట్



కార్పొరేట్ అనుకూల విధానాలు అనుసరిస్తున్న మోడీ బడ్జెట్‌లో కేటాయింపులు కూడా వారి లాభాల కోసమే అధిక ప్రాధాన్యత ఇచ్చారు. రూ.61 వేల కోట్ల విలువ చేసే ప్రభుత్వ సంస్థల్ని అమ్మాలని ఈ బడ్జెట్‌లో కూడా పేర్కొన్నారు. పారిశ్రామికాభివృద్ధి, కార్మికుల సంక్షేమం గురించి పట్టింపులేదు. ఆర్థిక రంగంలో మరిన్ని సంస్కరణలు తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం, బ్యాంకింగ్ కంపెనీల చట్టం, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టాలకు సవరణలు చేస్తామని చెప్పడమంటే ప్రయివేటీకరించడమే అవుతుంది. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను మరింత వేగంగా అమలు చేయనున్నట్లు బడ్జెట్ రూపకల్పన స్పష్టం చేస్తుంది. రోడ్లు, రైల్వే, విద్యుత్, టూరిజం వంటి రంగాలోనూ ప్రయివేట్ పెట్టుబడులకు అనుమతించడం ద్వారా కార్మికులు, ఉద్యోగుల్ని వీధిన పడేయాలని కేంద్రం చూస్తుంది. కేంద్రం అనుసరించే కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలు చేయాల్సిన అవసరముంది. ఇందుకుగాను అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా పోరాటాలకు సన్నద్ధం కావాలి.

- బి.సాయిలు, సీఐటీయూ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి

దళితులకు ద్రోహం చేసేలా బడ్జెట్



దళితులకు ద్రోహం చేసేలా కేంద్ర బడ్జెట్ ఉంది. దళితుల సంక్షేమం కోసం పెట్టిన పథకాలను ఎత్తి వేశారు. పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేశారు. ఆ పథకానికి ఈ బడ్జెట్‌లో వేల కోట్ల నిధుల్ని తగ్గించారు. పేదలకు ఉపయోగపడే పథకాల్ని దెబ్బతీయడం బీజేపీ రాజకీయ విధానంగా కనిపిస్తుంది. బీజేపీ దళిత వర్గానికి ద్రోహం చేస్తూ పెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా మండల కేంద్రాల్లో బడ్జెట్ పత్రాలను దగ్గం చేస్తాం. 20 శాతం ఉన్న దళితులకు 16 శాతం నిధులు మాత్రమే కేటాయించడమంటే ఆ సామాజిక వర్గాన్ని విస్మరించడమే అవుతుంది. మనుధర్మ సిద్ధాంతాన్ని నమ్మే బీజేపీ దళితుల పట్ల అనేక విషయాల్లో వివక్ష చూపుతుంది. బడ్జెట్ కేటాయింపుల్లోనూ అదే ధోరణి ప్రదర్శించింది. దళితులకు ఉపాధి కల్పించే ఉపాధి హామీకి నిధులు తగ్గించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఉపాధి నిధుల్లో కోత పెట్టడం ద్వారా బీజేపీ ప్రభుత్వం దేశంలో పేదరికాన్ని మరింత పెంచాలని చూస్తుంది. నిధుల్లో కోతలు పెట్టిన ప్రభుత్వం వచ్చే 20 ఏళ్లల్లో పేదలు లేని దేశంగా భారత్‌ను ఎలా మారుస్తుందో అర్థం కావడంలేదు.

- అతిమేల మాణిక్యం, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు

ఉద్యోగులు వీధినపడే ప్రమాదం



ప్రజా ప్రయోజనాల్ని విస్మరించి కేంద్ర బడ్జెట్ తయారు చేశారు. మోడీ పాలనలో ఏడేళ్ల అనుసరించిన విధానాల్ని మరింత వేగం చేసేందుకు ఈ బడ్జెట్ దోహదపడేలా ఉంది. కార్మికులు, కర్షకులు, రైతులు, మహిళలు, నిరుద్యోగులకు మేలు చేసే ఏ ఒక్క పథకమూ బడ్జెట్‌లో లేదు. ప్రభుత్వ సంస్థల్ని ప్రయివేటీకరించడం, అమ్మేయడం ద్వారా కోట్లాది మంది ఉద్యోగస్తులు వీధిన పడే ప్రమాదముంది. ఉన్న ఉపాధిని దెబ్బతీస్తున్న కేంద్రం నిర్ణయాల వల్ల దేశం ఆర్థికంగా మరింత దెబ్బతింటుంది. కార్పొరేట్ అనుకూల విధానాలు తప్పనిరుద్యోగులకు ఉపాధి కల్పించే ఏ విధానమూ కేంద్రం వద్దలేదు. ప్రజలు పెద్ద ఎత్తున కేంద్ర బడ్జెట్ పట్ల వ్యతిరేకత చూపుతున్నారు. పెరిగిన ధరల్ని ఎలా నియంత్రిస్తారో చెప్పలేదు. వలస కార్మికులకు భరోసా కల్పించే కార్యక్రమాలేవీలేవు. అంకెల గారడీ చేసి పేదరిక నిర్మూలన, ప్రపంచ దేశాలు పొగిడాయనే గొప్పలు చెప్పడంతోనే ఆర్థిక మంత్రి ప్రసంగం సరిపోయింది. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున కార్మికులు ఉద్యమాలకు సిద్ధం కావాల్సిన సమయం ఆసన్నమైంది.

- గోపాలస్వామి, సీఐటీయూ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి

పేదల పొట్టగొట్టే బడ్జెట్



పేదల పొట్టగొట్టే బడ్జెట్ ఇది. సంపన్నులకు రాయితీలిచ్చే బీజేపీ ప్రభుత్వం పేదల పథకాలకు కోత పెట్టింది. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధులు తగ్గించారు. ఉపాధి పథకం ద్వారా గ్రామీణ పేదలకు పని దొరుకుతుంది. పది నిదాలు, వేతనం పెంచాలని పేదలు పోరాడుతుంద్రు. బడ్జెట్‌లో నిధులు పెంచాల్సిన కేంద్ర ప్రభుత్వం ఉన్న నిధుల్ని తగ్గించింది. గతేడాది రూ.89400 కోట్లు కేటాయించారు. ఈ బడ్జెట్‌లో రూ.60 వేల కోట్లే కేటాయించారు. ఈ సారి రూ.29400 కోట్ల నిధుల్ని కోత పెట్టారు. పేదలకు పనిలేకుండా చేయడమే మోడీ నిర్ణయంగా ఉంది. పేదరిక నిర్మూలన వంటి గొప్ప డైలాగులు కొట్టిన ప్రధానమంత్రి, ఆర్థిక మంత్రి ఉపాధి హామీ పథకానికి నిదులు ఎందుకు తగ్గినట్లో దేశ ప్రజలకు చెప్పాలి. పేదలకు చేతుల్లో పని లేకుండా చేయడమే పేదరిక నిర్మూలన అవుతుందా? బీజేపీ ఎనిమిదేండ్ల పాలనలో ఈజీఎస్‌కు నిధుల కోత తప్ప ఏనాడూ పెంచింది లేదు. ఈ బడ్జెట్‌లో నిధులను భారీగా తగ్గించడంతో గ్రామీణులు మరింత పేదలుగా మారే ప్రమాదం ఉంది. బడ్జెట్‌లో నిధులు తగ్గించడాన్ని వ్యవసాయ కార్మిక సంఘం తీవ్రంగా ఖండిస్తుంది.

- నర్సింహ, వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు

స్కీమ్‌లను ప్రయివేటీకరించే కుట్ర



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ స్కీములకు ఈ బడ్జెట్‌లో నిధులు తగ్గించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టుకు నిధులు తగ్గించారు. అంగన్‌వాడీ కేంద్రాల్ని ప్రయివేట్ సంస్థలకు కట్టబెట్టే కుట్ర ఇందులో ఉంది. ఆకలి, రక్తహీనత, ఆరోగ్య సూచిలో ఎంతో వెనుకబడిన దేశంలో స్త్రీ,శిశు సంక్షేమ శాఖకు నిధులు పెంచకపోవడం విడ్డూరం. మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా దెబ్బతీసేలా కేటాయింపులు చేశారు. జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ కింద వైద్య సేవలందించే ఏఎన్ఎంలు, రెండో ఏఎన్ఎంలు, ఇతర వైద్య సిబ్బందిని తగ్గించే ప్రయత్నం జరుగుతుంది. అందుకే ఆ రంగానికి నిధులు పెంచలేదు. మహిళా సాధికారత గురించి గొప్పలు చెప్పే మోడీ మహిళల అభివృద్ధి కోసం నిధులు కేటాయించలేదు. మోడీ పాలనలో మహిళాభివృద్ధి మాటలే తప్ప ఆచరణలో ఏ మాత్రం కనిపించడం లేదు. ఈ బడ్జెట్‌పై అన్ని వర్గాల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రాబోయే కాలంలో మోడీ పెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ స్కీమ్ వర్కర్లు పెద్ద ఎత్తున ఉద్యమించాల్సి ఉంది. ఆ దిశగా సీఐటీయూ, ఇతర కార్మిక సంఘాలు పోరాటాలను ఉధృతం చేయాలి.

- కదారి నర్సమ్మ, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు

ప్రజా సంక్షేమం పట్టని మోడీ



నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రజా సంక్షేమం గురించి పెద్దగా కేటాయింపులు చేయలేదు. ఉన్న రాయితీలను తగ్గించారు. గత బడ్జెట్ కంటే వివిధ పథకాలకు నిధుల్ని తగ్గించారు. వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి మౌళిక రంగాల్ని విస్మరించి బడ్జెట్ తయారు చేశారు. ఈ అంకెల పద్దులు చదవడానికి ముద్దుగా అనిపిస్తారు. ఆచరణలో దేశాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఏ మాత్రం ఉపయోపడవు. ఏడేళ్లుగా ఇలాంటి కేటాయింపులు చేస్తూ వచ్చారు. అయినా దేశం విద్య, ఆరోగ్యం, ఆకలి, రక్తహీనత, సామాజిక భద్రత వంటి విషయాల్లో ప్రపంచ దేశాలతో భారత్‌ను పోల్చి చూస్తే ఎంతో దిగజారి ఉన్నామని అనేక సంస్థలు వెల్లడించాయి. అయినా మోడీ తన బడ్జెట్‌లో మౌళిక రంగాలకు పెద్దగా నిధుల్ని కేటాయించలేదు. తన రాజకీయ ప్రయోజనాలు, మిత్రులైన కార్పొరేట్ శక్తుల లాభాల చుట్టే బడ్జెట్ లెక్కల్ని తిప్పారు. అంకెల గారడీ వల్ల దేశ ప్రజలకు కలిగే ప్రయోజనాలేమీ ఉండవు. కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, నిరుద్యోగుల సంక్షేమం, అభివృద్ధిని విస్మరించి బడ్జెట్ రూపకల్పన చేశారు.

- బసవరాజు, సీఐటీయూ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి

మన ఊరు-మనబడితో పాఠశాలలకు సకల సౌకర్యాలు

జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్



నవతెలంగాణ-కొండపాక

'ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేయడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మన ఊరు మనబడి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పిస్తున్నాం' అని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. కుకునూరుపల్లి ప్రాథమిక పాఠశాల, దుద్దెడ ప్రాథమిక పాఠశాలలను ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ఆయన మాట్లాడుతూ జిల్లాలో 100 కోట్లతో అన్ని పాఠశాలల్లో విడతలవారీగా పనులు పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు కనీస వసతులు కల్పించి కార్పొరేటుకు దీటుగా తయారు చేస్తున్నామన్నారు. పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలన్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దుద్దెడ పాఠశాలలో రూమ్ టూ రీడ్ సంస్థ ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు ఆరేపల్లి మహాదేవ్, పోల్కంపల్లి జయంతి నరేందర్, ఎంపీపీ రాగల సుగుణ దుర్గయ్య, ఎంపిటిసిల ఫోరం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, ఈజీఎస్ స్టేట్ కమిటీ డైరెక్టర్ కోల సద్గుణ రవీందర్, ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, పీఏసీ ఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, దుద్దడ ఉపసర్పంచ్ ఆంజనేయులు, కుకునూరు పల్లి ఉప సర్పంచ్ బాల గౌడ్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు దుర్గయ్య పోలకంపల్లి నరేందర్, టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్ పాల్గొన్నారు.

విద్యాసంస్థలకు కొత్తరూపు: ఎమ్మెల్యే



నవతెలంగాణ-పటాన్‌చెరు

నిరుపేదలకు కార్పోరేట్ స్థాయి విద్యను అందించడంలో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన మన ఊరు-మనబడి పథకం విద్యారంగంలో విప్లవత్మక మార్పులకు శ్రీకారం చుడుతోందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మనఊరు-మనబడి పథకం ద్వారా రూ.51 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన పునర్నిర్మాణ పనుల ను స్థానిక ప్రజా ప్రతినిధితో కలిసి బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. పాఠశాల ప్రాంగణంలో తిరుగుతూ చేపట్టిన అభివద్ధి పనులను పరిశీలించారు. ఆధునిక వసతులతో ఆకర్షనీయమైన రంగులతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉట్టిపడేలా మౌలిక వసతులు ఏర్పాటు చేయడం పట్ల ఎమ్మెల్యే ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయితే ఏమి వస్తుందో తెలియజెప్పడానికి మన ఊరు మనబడి పథకం ఒక స్పష్టమైన ఉదాహరణ అన్నారు. నేడు ప్రభుత్వ విద్యాసంస్థల్లో అడ్మిషన్ల కోసం పోటీ పడాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని 55 ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు మనబడి పథకం ద్వారా పనులు ప్రారంభించామని.. వచ్చే విద్యా సంవత్సరం లోపు పనులు పూర్తవుతాయన్నారు. ప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై లక్ష రూపాయలు ఖర్చు చేస్తోందని.. కాబట్టి విద్యార్థులు శ్రద్ధతో చదువుకొని పటాన్‌చెరు నియోజకవర్గానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకుని రావాలని కోరారు. అనంతరం స్థానిక ప్రజా ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు. విద్యార్థులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి, జెడ్పీటీసీ సుప్రజా వెంకట్ రెడ్డి, సర్పంచ్ బాలమణి శ్రీశైలం, ఎంపీటీసీలు శ్రీశైలం, అంజిరెడ్డి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, ఎంపీడీవో బన్సీలాల్, పంచాయతీరాజ్ డీఈ సురేష్, మండల విద్యాశాఖ అధికారి రాథోడ్, బీఆర్ఎస్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో డబల్ బెడ్ రూమ్ ఇళ్లలోకి లబ్ధిదారులు



నవతెలంగాణ-చేగుంట

చేగుంట పట్టణం సీఎంఆర్ కాలనీలో గల 330 సర్వే నెంబర్‌లో 108 డబల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మిస్తున్నారు. ఇప్పటివరకు నలుగురు కలెక్టర్లు మారినా పనులు పూర్తి కాకపోవడంతో ఆగ్రహించిన లబ్ధిదారులు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఇళ్లల్లోకి వెళ్లారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, పోలీసులు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్దకు చేరుకొని లబ్ధిదారులకు నచ్చజెప్పారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బాలమణి మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వకుండా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. లబ్ధిదారులు ఇళ్ల కిరాయిలు కట్టలేక, కనీసం జీవనోపాధి లేక నానా ఇబ్బందులు పడుతున్నామని విన్నవించారు. తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు మాట్లాడుతూ చిన్నచిన్న మైనర్ పనులు ఉన్నందున త్వరలోనే పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. 'డబల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద కామారెడ్డి జిల్లా వాసి మాజీ నక్సలైట్, ఆయన పేరుట 330 సర్వే నెంబర్‌లో కొంత భూమి ఉంది. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించిన సంపును ఆక్రమించుకున్నాడు. చుట్టూ ప్రహరీ నిర్మించాడు. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించాలి' లబ్ధిదారులు తహసీల్దార్‌ను కోరారు.

అర్హులైన పేదలకు డబుల్ ఇండ్లు ఇవ్వాలి



నవతెలంగాణ-జోగిపేట

అసెంబ్లీలో సీఎం ప్రకటించిన మాట నిలబెట్టుకొని ఇంటి స్థలం ఉన్న వారికి రూ.5 లక్షల చెల్లించాలని.. నిజమైన లబ్దిదారులకే ఇండ్లను కేటాయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆందోల్ మున్సిపల్ పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆందోల్ జోగిపేటలో నిర్మిస్తున్న డబల్ బెడ్రూం ఇండ్లను నిజమైన లబ్దిదారులకు ఇవ్వకుండా.. ఇండ్లు ఉన్న వారికే ఇవ్వడం సరికాదన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో నిజమైన లబ్దిదారులను గుర్తించి ఇవ్వాలన్నారు. ఖాళీ స్థలం ఉన్నవారికి ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు తక్షణమే ఇవ్వాలనే డిమాండ్‌తో రేపు తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్, నాయకులు చెన్నయ్య, విట్టల్, రామకృష్ణ, లలిత, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

ఐకేపీ వీవోఏల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించి.. వాటి పరిష్కారానికి కృషి చేయాలని వీవోఏల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో సంగారెడ్డి నియోజక వర్గ వీవోఏలు ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాశ్‌రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. గత 20 ఏండ్లుగా గ్రామాల్లో మహిళా అభ్యున్నతికి కృషి చేస్తున్న వీవోఏలకు ప్రభుత్వం రూ.3,900 మాత్రమే చెల్లిస్తూ వెట్టి చాకిరి చేయిస్తున్నదన్నారు. ఈ చాలీ చాలని వేతనంతో వీవోఏలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి వీవోఏల సమస్యలు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే కోరారు. జిల్లా ఉపాధ్యక్షురాలు బి.అనిత, సహకార్యదర్శి ప్రవీణ్, కంది, కొండాపూర్, సంగారెడ్డి, సదాశివపేట మండలాల వీవోఏ నాయకులు అన్వర్, వీరేశం, అనిత, సంతోష పాల్గొన్నారు.



తుల్జాపూర్ భవానిమాత ఆలయంలో ఖేడ్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-నారాయణఖేడ్

మహారాష్ట్రలోని తుల్జాపూర్‌లో గల భవాని మాత అమ్మ వారిని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి దర్శించుకున్నారు. అమ్మవారి ఆశీస్సులు ఖేడ్ నియోజ కవర్గ ప్రజలపై ఉండాలని.. ప్రజలు పాడి పంటలతో, సిరి ధాన్యాలతో వర్ధిల్లాలని మొక్కుకున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు ఆత్మ కమిటీ ఛైర్మెన్ రమావత్ రాంసింగ్, శంకరంపేట్ - ఎంపీపీ జంగం శ్రీనివాస్, నారాయణఖేడ్ మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు సత్యపాల్ రెడ్డి, సర్పంచ్ కృష్ణరెడ్డిఉన్నారు.

ఈనెల 14న సదరం శిబిరం

నవతెలంగాణ-సంగారెడ్డి

ఈనెల 14న రెండో మంగళవారం సదరం శిబిరం నిర్వహించనున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గాయత్రీ దేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత స్లాట్ ఫిబ్రవరి 7న కేటాయించడం జరుగుతుందన్నారు. మీ సేవా ద్వారా స్లాట్స్ బుక్ చేసుకుని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించు సదరం క్యాంపునకు హాజరు కావాలని ప్రకటనలో పేర్కొన్నారు.

పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తుల గడువు పొడగింపు

నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలలో ఉన్నత విద్యనభ్యసిస్తున్న బీసీ, ఈబీసీ విద్యార్థుల ఉపకారవేతనాల దరఖాస్తు గడువును మార్చి 31 వరకు పొడిగించినట్టు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ.జగదీష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 సంవత్సరానికి గాను రెన్యూవల్ మరియు ఫ్రెష్ ఉపకారవేతనాలకు దరఖాస్తు చేసుకో వడానికి గడువు పొడగించారన్నారు. సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్ విద్యార్థులకు ఈ విషయాన్ని తెలియజేయాలన్నారు. http://telanganaepass.cgg.gov.in లో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి విద్యార్థులను ప్రోత్సహించాలని కోరారు.



తెలంగాణ లెక్చరర్స్ ఫోరం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సదాశివాపేట

తెలంగాణ లెక్చరర్స్ ఫోరం 2023-నూతన సంవత్సర క్యాలెండర్‌ను సదాశివపేట పట్టణంలోని భవిత జూనియర్ కళాశాలలో బీజేపీ రాష్ట్ర నాయకులు, ప్రముఖ న్యాయవాది దయాకర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ బాల్ రాజు చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గోపాల్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రాజేష్, స్వామి మరియు కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



వివాహ వేడుకలో పాల్గొన్న బాలసుబ్రహ్మణ్యరెడ్డి

నవతెలంగాణ-ఐడిఏబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీలోని పోచమ్మబస్తీ వాసి శ్రీనివాసరాజు కుమార్తె జ్యోతి వివాహం స్థానిక బేరాకా చర్చ్‌లో పాస్టర్ జోబాబు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు ముఖ్య అతిథిగా బొల్లారం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంతిరెడ్డి బాల సుబ్రహ్మణ్యరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతోపాటు యూత్ కాంగ్రెస్ సభ్యులు నందు, చంద్రశేఖర్, రఫీ ,రవిలి తదితరులు పాల్గొన్నారు.



శివాలయ పున:నిర్మాణానికి రూ.1లక్ష విరాళం

నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండల పరిధిలోని రాంసానిపల్లి గ్రామంలో గల శివాలయ పున:నిర్మాణానికి అందోల్, జోగిపేట మున్సిపల్ 17వ వార్డు కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు రూ.1 లక్ష విరాళం అందజేశారు. బుధవారం రాంసానిపల్లి వచ్చిన సందర్భంగా శివాలయ కమిటీ నిర్వహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం శిథిలావస్థకు చేరుకుంటుందని, పునఃనిర్మాణం చేయాలని నిర్ణయించినట్లు కమిటి నిర్వహకులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన స్పందించిన దేవాలయ పున:నిర్మాణానికి తనవంతు సహయంగా రూ.లక్షను అందజేస్తానని తెలిపి, చెక్కును నిర్వహకులకు అందజేశారు. కాగా ఆయన్ను ఆలయ కమిటీ నిర్వహకులు శాలువాను కప్పి ఘనంగా సత్కరించారు. పూజారి రాజిరెడ్డి అప్ప, గ్రామ నాయకులు జోగిరెడ్డి, లింగం, ఆగమయ్య, శివారెడ్డి, ప్రతీప్‌రెడ్డి, హన్మంతు పాల్గొన్నారు.



పెద్దచెల్మెడ పాఠశాలలో స్వయం పరిపాలనా దినోత్సవం

నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని పెద్దచెల్మడ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వయం పరిపాలనా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఉపాధ్యాయులుగా వరుణ్, దివాకర్, కార్తీక్, షర్మిల, అపర్ణ, హర్షిత, ఎస్తేర్, రాణి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాయిబాబా, ఉపాధ్యా యులు కిష్టయ్య అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యత





నవతెలంగాణ-న్యాల్‌కల్

సర్కారు బడుల్లో విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తున్నదని.. అందులో భాగంగానే మన ఊరు-మనబడి ద్వారా పాఠశాలల రూపు రేఖలను మారుస్తున్నదని జిల్లా కలెక్టర్ శరత్ అన్నారు. మన ఊరు - మన బడి మొదటి విడతలో భాగంగా మండలంలోని మెటల్‌కుంట జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో పూర్తైన అభివృద్ధి పనులను జెడ్పీ చైర్‌పర్సన్ మంజూ శ్రీ జైపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే మాణిక్‌రావుతో కలిసి బుధవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు మంచి బోధన అందించేందుకే ఈ పథకాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని.. పదో తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. కాగా ఈ పాఠశాలలో టెన్త్ పరీక్షా సెంట ర్‌ను ఏర్పాటు చేయాలని వారి దృష్టికి హెచ్ఎం ప్రభాకర్ రావు, సర్పంచ్ పీటర్ రాజు తీసుకువచ్చారు. కాగా కలెక్టర్ స్పందిస్తూ.. సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం హెచ్ఎం ప్రభాకర్ రావు మా ట్లాడుతూ.. మెటల్‌కుంట పాఠశాల అభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. రెండు టీవీలు, 11 సీసీ కెమెరాలను తనవంతుగా ఏర్పాటు చేశానన్నారు. అనంతరం కలెక్టర్‌ను, జెడ్పీ చైర్‌పర్సన్‌ను, ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఎంపీపీ అంజమ్మ, జెడ్పీటీసీ బి. స్వప్న, కాశీనాథ్, డీఈవో నాంపల్లి రాజేష్,బీఆర్ఎస్ అధ్యక్షులు రవీంద ర్, జిల్లా సీఈఓ ఎల్లయ్య, జిల్లా, మండల అధికారులు మారుతి రాథోడ్, విజయలక్ష్మి, సాబేర్ హుస్సేన్, వెంకట్‌రెడ్డి, సర్పంచులు,ప్రజాప్రతినిధులునర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి రక్షిత మంచినీరు అందిస్తున్నాం

నవతెలంగాణ-అమీన్‌పూర్

మిషన్ భగీరథ కార్యక్రమం ద్వారా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ప్రతీ ఇంటికి రక్షిత మంచినీరు అందిస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని శ్రీ షిరిడి సాయి కాలనీలో మిషన్ భగీరథ పథకం ద్వారా ఏర్పాటు చేసిన నల్లా కనెక్షన్లను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జవహర్ నగర్ కాలనీలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రూ.9 లక్షల అంచనా వ్యయంతో మన ఊరు-మనబడి పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాల్లో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అనంతరం కృష్ణారెడ్డిపేట గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మున్సిపల్ ఛైర్మెన్ తుమ్మల పాండురంగారెడ్డి, ఎంపీపీ ఈర్ల దేవానందం, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహ గౌడ్, సర్పంచ్‌లు కృష్ణ, నితీశా శ్రీకాంత్,ఉప సర్పంచ్ పహీమ్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్.. ప్రజా వ్యతిరేకం

నవతెలంగాణ-సంగారెడ్డి



2023-24 సంవత్సరానికి ప్రవేశపెట్టి కేంద్ర బడ్జెట్ పూర్తిగా ప్రజా వ్యతిరేకంగా ఉన్నదని సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జయరాజు విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి రావా ల్సిన వాటాను గణనీయంగా తగ్గించారన్నారు. గతంలో రాష్ట్రాల నుంచి వచ్చే పన్నుల్లో కేంద్రం 42శాతం తిరిగి రాష్ట్రాలకు ఇవ్వగా, గత సంవత్సరం నుంచి 41 శాతానికి తగ్గించిందన్నారు. ఇందులో తెలంగాణకు కేవలం 2.133 శాతం మాత్రమే తిరిగి వస్తున్నదన్నారు. అదికూడా సకాలంలో ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. 15వ ఫైనాన్స్ కమిషన్ కేటాయించిన ప్రకృతి వైపరీత్యాల పరిహారం, స్థానిక సంస్థల నిధులు, మున్సిపాలిటీలకు ఇచ్చే నిధులు, ఉన్నత విద్య ఆరోగ్యం తదితర రంగాలకు కేంద్రం నుండి రావాల్సిన నిధుల్లో రాష్ట్రానికి కోత పెట్టారన్నారు. రాష్ట్రంలో సాగునీటి వనరులకు నిధులు ఇవ్వాలని కోరినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నిరాకరిస్తున్నదన్నారు. ఈ బడ్జెట్‌లో రు.10,79,971 కోట్లు (24శాతం) వడ్డీల కిందనే చెల్లిస్తున్నారన్నారు. స్వదేశీ, విదేశీ అప్పులు కలిసి రు.137లక్షల కోట్లకు చేరుకున్నట్లు ఎకనమిక్ సర్వే తెలుపుతున్నది. 2025నాటికి 5ట్రిలియన్ డాలర్ల దేశ స్థూల ఉత్పత్తిని సాధిస్తామని ప్రధాని మోడీ అనేకసార్లు ప్రకటించారని.. అయితే రానున్న రెండేళ్ళలో రెట్టింపు స్థూల ఉత్పత్తి పెరుగుతుందా? అని ప్రశ్నించారు. ఈ యేడాది దేశ వృద్ధిరేటు 7శాతం ఉన్నట్టు చెపుతూనే 2023-24లో 6.5శాతానికి తగ్గుతుందని ఆర్థిక మంత్రి చెప్పారన్నారు. ఈ స్థితిలో దేశాభివృద్ధి ఎలా సాధ్యం అవుతుందన్నారు. ఉపాధిహామి చట్టానికి 2022-23లో 89,400 కోట్లు కేటాయించగా, ఈ బడ్జెట్‌లో 2023-24కు 60,000 కోట్లకే పరిమితం చేయడం ఈ చట్టాన్ని ఎత్తి వేయటంలో కుట్రనే అని అన్నారు. విద్యలో 33వ స్థానం, ఆరోగ్యంలో 66వ స్థానం ఉన్న దేశం అభివృద్ధి కావడానికి ప్రస్తుత బడ్జెట్ సహకరిస్తుందా అని ప్రశ్నించారు. ఇది సంపన్న వర్గాల మేలు కోరే విధంగా రూపొందించుకున్న బడ్జెట్ అని.. పేద ప్రజల సంక్షేమం కోసం ఏ మాత్రం అలోచన చేయలేదన్నారు. కనీసం జిల్లాకు ఒక్క రైల్వే లైన్ మంజూరు చేయలేదన్నారు. మియాపూర్ నుంచి సంగారెడ్డి వరకు మెట్రో రైలు సదుపాయం కోసం అలోచన చేయలేదన్నారు. మెట్రో రైలులైన్ కోసం నిధులు కేటాయించాలని సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కమిటీ డిమాండ్ చేస్తున్నదన్నారు. అలాగే జోగిపేట మీదుగా నారాయణఖేడ్ వరకు రైల్వే లైన్ వేయాలన్నారు.

ఆన్‌లైన్ పేపర్ వ్యాల్యూవేషన్ విధానం రద్దు చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

ఇంటర్ పరీక్షా పేపర్లను ఆన్‌లైన్‌లో వాల్యువేషన్ చేయాలనే నిర్ణయం సరికాదని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు ఎం.సురేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా డీఈఓ గోవింద్‌కు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడు పరీక్షా పేపర్‌ను తన చేతితో క్షుణ్ణంగా పరిశీలించి మార్కులు వేయడమే సరైన పద్ధతి అన్నారు. అలా కాకుండా ఆన్‌లైన్ ద్వారా వాల్యువేషన్ చేస్తే.. ఆన్‌స్క్రీన్ మీద ఎవరు కరెక్షన్ చేస్తారో తెలియని పరిస్థితి వస్తుందన్నారు. దీంతో 35 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. పనిభారం తప్పించుకునే పేరుతో విద్యార్థులపై ఆర్థిక భారాన్ని మోపే ఈ విధానం సరికాదన్నారు. విద్యార్థుల గోప్యతకు సంబంధించిన అన్ని వివరాలు ఏజెన్సీకి అప్పజెప్పటం తప్పు అన్నారు. గతంలో కరోనా పరిస్థితుల్లో అనివార్య కారణాల వల్ల కొన్ని యూనివర్సిటీలో ఈ విధానం ప్రారంభమై కొనసాగుతున్నదన్నారు. అయితే ఈ యూనివర్సిటీల్లో నేరుగా ఉపాధ్యాయులు చేసే వాల్యువేషన్‌కు రూ.30 ఖర్చు అయితే.. నూతన ఆన్‌లైన్ విధానంలో రూ.60 ఖర్చు అవు తున్నాయన్నారు. దీంతో ఈ అదనపు భారాన్ని తిరిగి విద్యా ర్థులపై బలవంతవంగా రుద్ది.. పరీక్ష ఫీజుల పేరుతో ఆ యూనివర్సిటీలు వసూలు చేస్తున్నాయన్నారు. ఈ విధానంతో విద్యార్థులపై ఫీజు భారం, ఆ ఏజెన్సీకి లాభం తప్పా మరొకటి ఉండదన్నారు. గతంలో అనుభవం లేని గ్లోబరినా కు పరీక్ష నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తే, అనేక తప్పులు జరిగి చాలా మంది విద్యార్థుల ఆత్మహత్యలు కూడా చేసుకు న్నారని గుర్తు చేశారు. కాబట్టి ఈ ఆన్‌లైన్ వాల్యువేషన్ విధా నాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. లేని యెడల పెద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి డివిజన్ ప్రసాద్ రామకృష్ణ, సిద్ధార్థ, ఆనంద్, విల్సన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-సదాశివపేట

అంగాన్వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీలో మాట్లాడాలని సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే తూర్పు జయప్రకాశ్‌రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వి.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ లాంటి చట్టపరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. అంగన్వాడి ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా చేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ వాగ్దానాన్ని వెంటనే అమలు పరచాలన్నారు. ఈ సమస్యలన్నింటిని అసెంబ్లీలో లేవనెత్తి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరినట్టు తెలిపారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందించి.. అంగన్వాడీ ఉద్యోగుల సమస్యల గురించి అసెంబ్లీలో తప్పని సరిగా మాట్లాడతాన న్నారు. ఈ సమస్య పరిష్కారం అయ్యే ంత వరకు ప్రభుత్వం పైన ఒత్తిడి తెస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. నాయకులు భూషణం ఎంబికయుం అంగన్వాడి యూనియన్ నాయకులు సంగీత, ప్రావీన, శశికళ పాల్గొన్నారు.

శుభకార్యాల కోసం అద్దెకు ఆర్టీసీ బస్సులు

నవతెలంగాణ-నారాయణఖేడ్



పెండ్లిళ్లు, శుభకార్యాలకు ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇవ్వనున్నట్టు ఖేడ్ డిపో మేనేజర్ మల్లేషయ్య తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..పెళ్లిళ్లకు, విందులకు, విహారయాత్రలకు నారాయణఖేడ్ డిపో నుంచి అద్దెకు బస్సులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆర్టీసీ బస్సులతో సురక్షితమైన ప్రయాణమే కాకుండా.. ధరలు కూడా అందుబాటులో ఉంటాయని మార్కెటింగ్ ఇన్‌చార్జి పాండు తెలిపారు. బస్సు బుకింగ్ వివరాల కోసం ఏఎంటి ప్రవీణ్‌కుమార్ 9494093486 పిఆర్‌ఓ, పాండు 9441071134 బస్ బుకింగ్ ఇన్చార్జ్, రాధాకృష్ణ 9949939489 నెంబర్లను సంప్రదించాలన్నారు.

విద్యారంగానికే ప్రభుత్వం పెద్దపీట



నవతెలంగాణ-జహీరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికే అధిక ప్రాధాన్యతనిస్తున్నదని జెడ్పీ చైర్‌పర్సన్ మంజూశ్రీ రెడ్డి అన్నారు. మన ఊరు - మన బడి కార్యక్రమంలో భాగంగా రంజోల్ ప్రాథమిక పాఠశాలలో రూ.40.80 లక్షల ఎంఓఎండి నిధులతో నిర్మించిన భవనాన్ని ఎమ్మెల్యే మాణిక్‌రావుతో కలిసి బుధవారం ఆమె ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత పాలకవర్గాల ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేశాయని.. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగ రక్షణకు శ్రీకారం చుట్టిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాల ఏర్పాటు చేసి పేద మధ్య తరగతి వర్గాల పిల్లలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నదన్నారు. నేడు మన ఊరు-మన బడి పథకంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ బోధనతోపాటు.. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నదన్నారు. కాబట్టి తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాల న్నారు. జిల్లా పరిషత్ సీఈఓ ఎల్లయ్య, ఆత్మ కమిటీ ఛైర్మెన్ పెంటారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జహీరాబాద్ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మోహియోద్దీన్, మాజీ మున్సిపల్ ఛైర్మెన్ మంకల్ సుభాష్, వైద్యనాథ్, బసిత్, మద్దే రామ్‌రెడ్డి, సత్యం ముదిరాజ్, శంషుద్దిన్, ఇజ్రాయెల్ బాబీ, మిథున్‌రాజ్, మొహమ్మద్ యూనిస్, దీపక్ అప్పీ, గంజాయి ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకం



నవతెలంగాణ-జోగిపేట

తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకంగా పనిచేశారని అందోలు ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. బుధవారం అందోలు జర్నలిస్టులకు ఎమ్మెల్యే స్వగ్రామమైన పోతులబోగుడ గ్రామంలో ఇండ్ల స్థలాల పట్టా సర్టిఫికేట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారన్నారు. రాష్ట్రం ఏర్పాటు తర్వాత ముందుగా ప్రెస్ ఆకాడమీని ప్రభుత్వం ఏర్పాటు చేసిం దన్నారు. జర్నలిస్టులకు ఇండ్లు, హెల్త్‌కార్డులు, పిల్లలకు ఉచిత విద్య సౌకర్యాన్ని కల్పిస్తున్నదన్నారు. విదేశాల్లో ఉన్నత విద్యకు సైతం ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నదన్నారు. ఇండ్ల స్థలాలను ఇస్తున్నామని మాకు అనుకూలంగా ఉండాలని ఏనాడు చెప్పలేదని, అలా చెప్పడం మంచి పరిణామం కాదన్నారు. నిర్మాణాత్మకమైన సలహాలను ఇవ్వాలని, అందరం కలిసి అభివృద్ధిని చేసుకుందామన్నారు. అర్హులైన వారందరికీ ఇళ్ల పట్టాలు అందజేస్తామని ఆయన హామీని ఇచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ మధుకర్‌రెడ్డి, ఎంపీ జోగు బాలయ్య, వైస్ ఎంపీపీ పట్లోళ్ల మహేశ్వర్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ గూడెం మల్లయ్య, మాజీ ఎంపీపీ రామ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ నాగరాజు (నాని), రేణుకా ఎల్లమ్మ ఎత్తిపోతల పథకం ఛైర్మెన్ లింగాగౌడ్, మాజీ మార్కెట్ డైరెక్టర్ మాణిక్‌రెడ్డి, ఆత్మగౌరవ కమిటీ అధ్యక్షుడు వీరభద్ర రావు, రాష్ట్ర జర్నలిస్టు సంఘం నాయకులు ఎ.రాంబాబు, రాజశేఖర్ కులకర్ణి, తాలుకా ప్రింట్, ఎలక్ట్రానిక్ యూనియన్ అధ్యక్షులు పవన్‌కుమార్, ప్రదీప్‌గౌడ్, జిల్లా నాయకులు భగత్, రాజు, సంతోష్, రమేష్, శ్రీనివాస్, రాజేశ్, సంజీవ్ కుమార్, అనిల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య



నవతెలంగాణ-వట్‌పల్లి

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని.. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన సౌకర్యాలను కల్పించి విద్యను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం పటిష్టమైన ఆలోచన విధానంతో ముందుకుపోతున్నదని ఆందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ తెలిపారు. మండల పరిధిలోని నాగులపల్లిలో మన ఊరు-మనబడి పథకం కింద నిర్మించిన అదనపు గదులను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మంచినీటిని, మరుగుదొడ్లను, తరగతి అదనపు గదులను నిర్మించి, విద్యార్థులు కూర్చునేందుకు బెంచ్‌లను సైతం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉపాధ్యాయులకు స్టాఫ్ రూమ్ కూడా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కాబట్టి పిల్లలందరినీ సర్కారీ బడుల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. గ్రామస్తులందరూ ఐక్యమత్యంతో గ్రామంలోనే విద్యను అభ్యసించే విధంగా కృషి చేస్తే టెన్త్ క్లాసుకి కూడా ఆమోదం పొందేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం పాఠశాల అవరణలో గ్రంథా లయాన్ని ప్రయాణ ప్రాంగణాన్ని ప్రారంభించారు. ఎంపీపీ పత్రి కృష్ణవేణి నర్సింలు, జెడ్పిటిసి పత్రి అపర్ణ శ్రీకాంత్, ఎంపీడీవో జగదీశ్వర్, ఎంపీఓ యూసుబ్, మండల ఇన్చార్జి విద్యాధికారి కృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, రాము లు, వరం ఛైర్మన్ వీరారెడ్డి, తాళేల్మే ఎల్లమ్మ ఎత్తిపోతల పథకం ఛైర్మెన్ లింగ గౌడ్, స్థానిక సర్పంచ్ నారాయణ గౌడ్, గౌతాపూర్ సర్పంచ్ ఖయ్యూం మహమ్మద్, బీఆర్ఎస్ నాయకులు బసవరాజ్, సుభాష్‌గౌడ్,సుభాష్ పాల్గొన్నారు.

సంస్కృతితో ముడిపడిందే భాష



నవతెలంగాణ-పటాన్‌చెరు

మన సంస్కృతితో భాషకు దగ్గరి అనుబంధం ఉందని, సాంస్కృతిక సహనం కూడా భాషతో ముడిపడి ఉంటుందని ఐఐటీ హైదరాబాద్‌లోని జాతీయ పోస్ట్ డాక్టరల్ ఫెలో డాక్టర్ వి.కీర్తన కపిలే అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్స్ లోని మనస్తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'సరాన్నజీవి: భాష, జ్ఞానం' అనే అంశంపె ఆమె బుధవారం ఆతిథ్య ఉపన్యాసం చేశారు. మనం మాట్లాడదలచుకున్నప్పుడు, ముందుగా, ఎదుటివారి మానసిక స్థితిని అర్థం చేసుకోవాలని, వారు పరధ్యానంగా ఉండకుండా చూసుకోవాలని, వారితో స్పష్టమైన సాన్నిహిత్యం కలిగి ఉండాలని, సూటిగా మాట్లాడాలని సూచించారు. అప్పుడు మనం చెప్పేది ఎదుటి వారు అర్థం చేసుకుని ప్రతిస్పందిస్తారని, మన చర్యకు ప్రతి చర్య ఉంటుందన్నారు. మాతృభాష అనేది సహజ సిద్ధంగానే అలవడుతుందని, ద్వితీయ లేదా పర భాషను నేర్చుకోవడానికి సామాజిక జ్ఞానాన్ని ఉపయోగి ంచాల్సి ఉంటుందని డాక్టర్ కీర్తన స్పష్టీకరించారు. పరుష వచనాలు లేదా దుర్భాషలను మాతృభాషలో మాట్లాడి నంత సులువుగా పర భాషలో మాట్లాడలేనున్నారు. ఈ సందర్భంగా మనస్తత్వశాస్త్ర విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆమె సందర్భోచిత జవాబులిచ్చి ఆకట్టుకున్నారు.

జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు డీడీఎస్ కృషి



నవతెలంగాణ-ఝరాసంగం

జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు డెక్కన్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళా సంఘాలతో నిర్వహిస్తున్న వారు చేస్తున్న కృషి ఎంతో అమోఘం అని మండల అభివృద్ధి అధికారి సుజాత అన్నారు. మండల పరిధిలోని బస్టాండ్ ఆవరణలో 23వ పాత పండుగ జాతర కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. 60 నుండి 70 రకాల విత్తనాలను నిల్వ ఉంచి ఒక ఎకరా పొలంలో అంతర పంటలు వేయడంతో అన్ని రకాల పక్షులు పిట్టలను బ్రతికించడంలో తోడ్పడుతుందని జీవవైవిధ్య మహిళా రైతు దండు స్వరూపమా అన్నారు. చిరుధాన్యాలను మాతోటే అంతరించి పోకుండా మందు తరానికి కూడా వీటిని అలవాటు చేస్తూ కొనసాగిస్తున్నామన్నారు. చిరుధాన్యాలపై దేశ ప్రధానికి వివరించడం చాలా గర్వంగా ఉందన్నారు. చిరుధాన్యాలను పండించిన రైతులకు ప్రభుత్వం ఎకరాకి రూ.10,000 రైతు బంధు అందించాలన్నారు. అంతేకాకుండా చిన్న రైతులే కాకుండా 20 ఎకరాలు గల పెద్ద రైతులు ముందుకు వచ్చి చిరుధాన్యాలతో పాటు, దేశీయ కూరగాయలను పండించాలన్నారు. ఏవో వెంకటేష్ మాట్లాడుతూ... మండలంలో 20శాతం నేలలు మాత్రమే నీటి ఆధారిత పంటలు పండిస్తున్నారని, మిగిలిన 80 శాతం నేలలలో వర్షాధారిత పంటలు పండిస్తున్నారు అని పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి చిరుధాన్యాల దినోత్సవాన్ని ప్రకటించడం ఎంతో గర్వకారణం అని, అంతేకాకుండా ఇంటి ఆరోగ్యానికి కావలసిన ఆహార ధాన్యాలను రైతులే పండించుకోవాలని సూచించారు. చిరుధాన్యాలకు మద్దతు ధర విషయమే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు రజిని ప్రియ, శంకర్ పాటిల్, గ్రామ సర్పంచ్ జగదీశ్వర్, మాజీ మండల అధ్యక్షులు హనుమంత్ రావు పాటిల్, మాజీ సర్పంచ్ పెంటన్న, డిడిఎస్ కోఆర్డినేటర్లు నర్సింలు, మాణిక్యం, బాలయ్య మహిళలు తదితరులు పాల్గొన్నారు.

చౌరస్తాల్లో గస్తీ కరువు

పట్టపగలే దొంగతనాలు..

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలో దొంగలు రెచ్చిపోతున్నారు. చౌరస్తాల్లో గస్తీ లేకపోవడంతో దొంగలు రోజురోజుకూ పెట్రేగిపోతున్నారు. పట్టపగలే యథేచ్ఛగా దోపిడీలు చేస్తున్నారు. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. నెల క్రితం కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తి బైక్‌పై వెళ్తుండగా.. గంగ్వార్ చౌరస్తాలో గుర్తు తెలియని దొంగలు అడ్డుకున్నారు. అతడిని బెదిరించి భయభ్రాంతులకు గురి చేశారు. అయినప్పటికీ ఈ విషయాన్ని పోలీసులు తేలిగ్గా తీసుకున్నారు. కాగా తాజాగా రెండ్రోజుల క్రితం న్యాల్కల్ గ్రామరోడ్డులో పట్టపగలే మొబైల్ ఫోన్లను ఎత్తుకెళ్లడానికి దొంగలు యత్నించగా స్థానికులు పట్టుకున్నారు. కాగా పోలీసులు చూసీ చూడనట్టు వ్యవహరించడంతోనే దొంగలు రెచ్చిపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా చౌరస్తాల్లో గస్తీని పెంచి.. దొంగతనాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

పిల్లలతో భోజనం చేయడం ఆనందంగా ఉంది



నవతెలంగాణ-చిన్నశంకరంపేట

పిల్లలతో రుచికరమైన భోజనం చేయడం ఆనందంగా ఉందని మెదక్ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గజగట్లపల్లిలో బుధవారం మన ఊరు, మన బడి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పాఠశాలలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంత రం పాఠశాల గదులలో ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో సహ కూర్చొని భోజనం చేశారు. స్థానిక సర్పంచ్ మీనా రవీందర్ ఎమ్మెల్యేతో పాటు విద్యార్థులకు భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పట్లోరి మాధవి రాజు, ఎంపీడీవో ప్రవీణ్, ఎంఈఓ యాదగిరి, పీఆర్ ఏఈ విజయ్ కుమార్, రైతు సమితి మండల కన్వీనర్ లక్ష్మారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు లక్ష్మీ నరసయ్య, శ్రీనివాస్ రెడ్డి, దయానంద్ యాదవ్, పూలపల్లి యాదగిరి, రమేష్ నాయక్, నాయకులు కుమార్ గౌడ్, రవీందర్ రెడ్డి, నాగభూషణం పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలి



తెలంగాణ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శోభన్ బాబు

నవతెలంగాణ-నర్సాపూర్

ఒరిస్సాలోని పూరీలో ఈ నెల 15వ తేది నుంచి జరిగే 44వ జాతీయ స్థాయి సీనియర్ సాఫ్ట్ బాల్ పోటీలలో రాణించాలని తెలంగాణ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శోభన్ బాబు అన్నారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలోని గిరిజన గురుకుల పాఠశాలలో తెలంగాణ సాఫ్ట్ బాల్ పురుషుల జట్టు శిక్షణ శిబిర ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శిక్షణ పొందిన తెలంగాణ సాఫ్ట్ బాల్ పురుషుల జట్టు జాతీయస్థాయిలో రాణించి మన రాష్ట్రానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు కొడిపాక నారాయణ గుప్తా, సాఫ్ట్ బాల్ జాతీయ శిక్షకులు కృష్ణ, జిల్లా సాఫ్ట్ బాల్ ఉపాధ్యక్షులు అజయ్ కుమార్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ సుందర్ శర్మ, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బిక్షమయ్య, ప్రాంతీయ క్రీడా అధికారి సుజాత పాల్గొన్నారు.

పేదింటి వధువులకు పుస్తె మట్టెలు అందజేత



నవతెలంగాణ-నర్సాపూర్

సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలోని మంగాపూర్ గ్రామానికి చెందిన కొండని రేణుక నర్సింలు దంపతుల కూతురు సంగీత వివాహానికి బుధవారం శివంపేట మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామానికి చెందిన ప్రముఖ సంఘ సేవకులు శివ రత్న అవార్డు గ్రహీత బిఆర్ఎస్ పార్టీ మండల పార్టీ కోశాధికారి బండారి గంగాధర్ తన వంతు సాయంగా పుస్తె మెట్టెలు అందజేశారు. అదేవిధంగా పిల్లుట్ల గ్రామానికి చెందిన మంగళపర్తి బిక్షపతి పోచమ్మ దంపతుల కూతురు స్రవంతి వివాహానికి సైతం బండారి గంగాధర్ పుస్తె మెట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట నాయకులు పిల్లి మధు, పెద్దపులి సతీష్, పిల్లి శివకుమార్, గొల్ల శ్రీశైలం, కుమ్మరి నాగరాజు, రవీందర్, పర్వతాలు, పెద్దపులి మహేష్,పెద్దపులి చింటూ పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహ స్వామి హుండీ ఆదాయం రూ.1,14,666లు



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని స్థానిక లక్ష్మీనరసింహ ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు చేపట్టినట్టు జిల్లా దేవాదాయశాఖ పరిశీలకుడు రంగారావు బుధవారం తెలిపారు. 2022, సెప్టెంబర్ 6 నుంచి 2023, ఫిబ్రవరి 1 వరకు రూ.1,14,666 హుండీ ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో విశ్వనాథ శర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ మహిళ సేవా సమితి సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మీసేవపై తప్పుడు ప్రచారాలు ప్రజలు నమ్మవద్దు



నవతెలంగాణ-చేగుంట

మీసేవలపై వస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని టీఎస్ ఎంఆర్పీఎస్ జాతీయ కార్యదర్శి ఎర్ర యాదగిరి మాదిగ అన్నారు. ఆధునిక యుగంలో ఆన్లైన్ సేవలు ఎంతో ప్రాముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ మీసేవ, ఈసేవలతో ప్రతి విద్యార్థి కంప్యూటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో పనులు చేసుకుంటున్నారని, కొందరు వ్యక్తులు మీసేవలపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. మీసేవతో చుట్టుపక్కల ప్రజలకు అనేక ఉపయోగాలు కలుతున్నాయన్నారు. కొందరు పనిగట్టుకుని చేగుంటలో మీసేవపై తప్పుడు ప్రచారాలు చేయడం సరైనది కాదని తెలిపారు. తప్పుడు ప్రచారాలు, ఆరోపణలు చేయడం మానుకోవాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి కూతురు వివాహానికి హాజరైన సీఎం కేసీఆర్,మంత్రులు,ఎమ్మెల్యేలు



నవతెలంగాణ హవెలిఘనపూర్

సీఎం కేసీఆర్ రాజకీయ కార్యదర్శి ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి కూతురు వివాహానికి ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. బుధవారం హైదరాబాదులోని కొంపల్లిలోని సిద్ కన్వెన్షన్ హాల్లో జరిగిన ఈ వివాహ వేడుకలకు సీఎం కేసీఆర్‌తో పాటు ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, రాష్ట్ర మంత్రులు హరీష్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, దయాకర్ రావు, ఇంద్రకరణ్ రెడ్డి మల్లారెడ్డి, శ్రీనివాస్ యాదవ్, కొప్పుల ఈశ్వర్ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంతరావు, పద్మ దేవేందర్ రెడ్డి, మాణిక్యరావు, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి వివిధ ప్రముఖులు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలను ప్రారంభించిన ప్రజాప్రతినిధులు



నవతెలంగాణ-ములుగు

మండల పరిధిలోని కుకుంట గ్రామంలో మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంపీపీ లావణ్య అంజన్న గౌడ్, జెడ్పీటీసీ జయమ్మ అర్జున్ గౌడ్ సర్పంచ్ బంగ్లా గణేష్ ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డిలు ప్రారంభించారు. అనంతరం ఉపాధి హామీ పథకంలో భాగంగా మంజూరైన పది లక్షల అంచనాతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ సీఎం పాఠశాలలకు నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను ఏ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కేసీఆర్ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ఆధునాతనమైన సౌకర్యాలతో నిర్మిస్తున్నారన్నారు ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ మురాడి నర్సింగరావు, ఎంఈఓ నరసింహారావు, మన ఊరు మనబడి ఏఈ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

నవతెలంగాణ-కౌడిపల్లి : ప్రమాదవశాత్తు బైక్‌పై వెళుతూ కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన కౌడిపల్లి మండలం నాగసాన్‌పల్లి హనుమాన్ టెంపుల్ వద్ద చోటు చేసుకుంది. కుటుంబీకుల కథనం ప్రకారం. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం రాఘవ పల్లి గ్రామానికి చెందిన న్యాల కంటి భూమేష్ (28) గత కొన్ని రోజులుగా గండిమైసమ్మలో కూలి పని చేస్తున్నాడు. కూలి పని చేస్తూ అప్పుడప్పుడు ఇంటికి వచ్చి వెళుతుంటాడు. అలాగే 29న ఇంటికి వచ్చి తన మోటార్ సైకిల్‌పై కూలీ పని కోసం వెళ్ళాడు. 31న రాత్రి మృతుడు భూమేష్ నాగసాన్ పల్లి హనుమాన్ టెంపుల్ దగ్గర రోడ్డు పక్కన చలనం లేకుండా పడి ఉన్నాడని, మృతుని తమ్ముడు శేఖర్‌కు ఫోన్ వచ్చింది. అటుగా వెళుతున్న ప్రయాణికులు చూసి మృతుడు భూమేష్ పడి ఉన్న విషయం కుటుంబ సభ్యులకు తెలిపి నర్సాపూర్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు నర్సాపూర్ ఆసుపత్రికి వచ్చి చూడగా మృతుడు భూమేష్ మరణించాడు. ప్రమాదవశాత్తు బండిపై వెళ్తూ తన భర్త చనిపోయాడని భార్య మంజుల తెలిపారు. మృతుని భార్య మంజుల ఫిర్యాదు మేరకు కౌడిపల్లి ఎస్సై శివప్రసాద్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో

నవతెలంగాణ-నర్సాపూర్

ఫిబ్రవరి 5 నుంచి జరగనున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం విద్యా రంగానికి 30% నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సతీష్ అన్నారు. బుధవారం విద్యారంగానికి 30% నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ నర్సాపూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వివిధ కళాశాలల విద్యార్థులు రాస్తారోక్ ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.3500 కోట్ల స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్కాలర్షిప్ లు రాకపోవడంతో పేద విద్యార్థులు ఫీజులు కట్టలేక చదువులకు దూరమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు . ఫీజులు కట్టకపోవడంతో కళాశాలలో యాజమాన్యాలు విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి ముప్పై శాతం నిధులు కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. లేకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షులు రాజేష్,, కార్యదర్శి



శ్రీకాంత్ ,డివిజన్ నాయకులు ఆకాష్, లక్ష్మి ప్రసాద్, మహేష్ , శ్రీకాంత్, సిద్దు, ప్రకాష్, శివారెడ్డి, కిరణ్,, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

ఇది కర్ణాటక ఎన్నికల బడ్జెట్

నవతెలంగాణ-జహీరాబాద్

పార్లమెంట్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం ఎన్నికలు జరిగే రాష్ట్రాలను దృష్టిలో పెట్టుకుని పెట్టినట్లుగా ఉందని పలువురు రాజకీయ నాయకులు, విశ్లేషకులు విమర్శిస్తున్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ మాటలు మైమరిపించే విధంగా అంకెలను పదాలను క్రోడీకరించారని అన్నారు. ఇది కర్ణాటక ఎన్నికల బడ్జెట్‌లా ఉందన్నారు. కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజలను ఆకర్షించేందుకు బడ్జెట్లో కొన్ని అంశాలను పొందుపర్చారని అన్నారు.

తెలంగాణను మర్చిపోయిన బడ్జెట్

: ఎమ్మెల్యే మాణిక్‌రావు



కేంద్ర బడ్జెట్‌తో తెలంగాణకు ఒరిగిందేమీ లేదని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలను కాపీ కొట్టారన్నారు. రాష్ట్రంలో గిరిజన యూనివర్సిటీ, రైల్వే లైన్ల ఏర్పాటుకు నిధులు ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికలు ఉన్నందున ఆ రాష్ట్రానికి ప్రత్యేక కరువు బడ్జెట్లో ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

సామాన్యులకు ప్రయోజనం శూన్యం

: టీపీసీసీ నాయకులు వై నరోత్తం



కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌తో సామాన్యులకు ఎలాంటి ప్రయోజనం లేదని టీపీసీసీ నాయకులు వై.నరోత్తం అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు మరింత పెరిగే ఆస్కారముందన్నారు. ఉపాధి హామీ, విద్య, వైద్యానికి నిధులు కేటాయించకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ బడ్జెట్ అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు.

ప్రజా వ్యతిరేక బడ్జెట్

: సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.రామచందర్



కేంద్ర బడ్జెట్‌లో కార్మికులను, కర్షకులను పూర్తిగా విస్మరించిందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.రామచందర్ అన్నారు. ఇది కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రకటించిన బడ్జెట్ అని విమర్శించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి గత బడ్జెట్లో 89 వేల కోట్ల కేటాయిస్తే ప్రస్తుత బడ్జెట్లో రూ.60 వేల కోట్లకు తగ్గించి కూలీలు, పేదల పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఉన్న వ్యతిరేకతకు నిదర్శనమన్నారు. యూరియాకు రూ.15 వేల కోట్లు తగ్గించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ బడ్జెట్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.

రైతులకు నిరాశే

: తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చల్లారా తిరుపతిరెడ్డి



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో దేశ రైతాంగానికి తీవ్ర నిరాశ మిగిలింది. కేంద్ర ప్రభుత్వం రూ.45 లక్షల కోట్ల బడ్జెట్లో రైతాంగానికి రూ.20 వేల కోట్లు కేటాయించింది' అని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చల్లారా తిరుపతిరెడ్డి అన్నారు. ఈ బడ్జెట్ కేవలం కార్పొరేట్లకే ఆమోదయోగ్యంగా ఉందన్నారు. కరోనా సమయంలో దేశాన్ని మొత్తం రైతాంగమే ఆదుకుందన్నారు. రైతు ఉత్పత్తి చేసే దాంట్లో క్వింటాల్‌కు ఖర్చు 40 శాతం పెరిగిందన్నారు. కేంద్రం ఇచ్చే మద్దతు ధర 10 శాతం ఇవ్వడం ఎంతవరకు న్యాయమన్నారు.

ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి పర్చడమే సీఎం లక్ష్యం

మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీత రెడ్డి, ఎమ్మెల్యే మదన్ రెడ్డి

నవతెలంగాణ-నర్సాపూర్





ప్రభుత్వ పాఠశాలలను అన్ని రంగాలలో అభివృద్ధి పరచాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీత రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డిలు అన్నారు. బుధవారం శివంపేట మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మన ఊరు మనబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీత రెడ్డి, ఎమ్మెల్యే మదన్ రెడ్డిలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ మన ఊరు మనబడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు కోసం ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని తెలిపారు. పిల్లుట్ల ప్రాథమికోన్నత పాఠశాలలకు మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా 35 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ నిధులతో పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం అన్ని వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తయారు చేయాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్, జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ,, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మన్సూర్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రమణ గౌడ్, మండల కోశాధికారి బండారి గంగాధర్, గ్రామ సర్పంచ్ పెద్దపులి రవి, పాఠశాల చైర్మన్ పిల్లి మధు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

జగదాంబ సేవాలాల్ విగ్రహ ప్రతిష్టాపన

నవతెలంగాణ-నిజాంపేట



మండల కేంద్రంలో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి దాదాపు రూ.6.29 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను శస్త్ర చికిత్సలు చేయించుకున్న బాధితులకు బుధవారం ఎంపీపీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ ఆసుపత్రులలో వైద్యం చేయించుకున్న ప్రతి పేదవారికి మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తుందన్నారు. అనారోగ్యం పాలై చేతిలో డబ్బులు లేని వారు మెరుగైన వైద్యం చేయించుకున్న వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల ద్వారా ప్రభుత్వము ఆదుకుంటుందన్నారు. అనంతరం తిప్పనగుల్ల గ్రామపంచాయతీ పరిధిలోని షౌకత్‌పల్లి లంబాడి తండాలో జగదాంబ సేవాలాల్ విగ్రహ ప్రతిష్టాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ దేశెట్టి సిద్ధ రాములు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అమరసేనారెడ్డి, గ్రామ సర్పంచి అనూష లక్ష్మీనరసింలు, ఎంపీటీసీ లహరి కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ బాబు, రామాయంపేట పీఏసీఎస్ చైర్మన్ బాదే చంద్రం, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వై.వెంకటేశం, రెడ్డి శెట్టి రవీందర్, బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, తిరుమల స్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల మహేష్, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ సంపత్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బాల్‌రెడ్డి, నిజాంపేట పీఏసీఎస్ చైర్మన్ బాపురెడ్డి, నార్లాపూర్ మాజీ సర్పంచ్ గోపరి నర్సింలు, తిప్పనగుల్ల సర్పంచి చంద్రవర్ధిని, గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షుడు నాగరాజు, బిఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు మావురం రాజు, బీఆర్ఎస్ కార్యకర్తలు నాయిని లక్ష్మణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మోడీ పరీక్షపే చర్చకు వెళ్ళిన ఉపాధ్యాయురాలికి సన్మానం



నవతెలంగాణ-చేగుంట

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఢిల్లీలో నిర్వహించిన పరీక్షపే చర్చకు చేగుంట పట్టణ ఆదర్శ పాఠశాల ఇంగ్లీష్ బోధన ఉపాధ్యాయురాలు కళ్యాణి హాజరు కావడం సంతోషకరమని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు మంచి కట్ల శ్రీనివాస్ సంతోషం వ్యక్తం చేశారు. ఆదర్శ పాఠశాలలో బుధవారం ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు కళ్యాణి ని మెమోంటో అందజేసి శాలువాతో సన్మానం చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రధానితో హాజరు కావడం చేగుంటకు ఎంతో గౌరవమన్నారు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ భూపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఢిల్లీలో నిర్వహించిన పరీక్ష పే చర్చ కార్యక్రమానికి ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు కళ్యాణికి ఆహ్వానం రావడం పాఠశాలకు ఎంతో గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కమల్, వాసవి దేవి, నాగమణి, అనిత, గౌస్, కిషోర్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను సన్మానించిన ఆలయ ధర్మకర్త

నవతెలంగాణ-చేగుంట

చేగుంట మండలం ఇబ్రహీంపూర్ గ్రామంలో గత నాలుగు రోజుల నుంచి శ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు శ్రీవారి ఊరేగింపు కార్యక్రమం, రాత్రి కళాకారులతో ఆటపాట కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కిషన్ రావు దేశముఖ్ గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలుపుతూ శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కళాకారులను సన్మానించి, వారికి మెమోంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాకారుడు స్వామి, గ్రామస్తులు కుమ్మరి గోపాల్, రజనీకాంత్, సర్పంచ్ దోరగొల్ల రాములు, మల్లేశం, బిక్షపతి, యాదగిరి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



కంటి వెలుగు శిబిరం ప్రారంభం

నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని బెజ్జంకి క్రాసింగ్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని జెడ్పీటీసీ కనగండ్ల కవిత, ఎఎంసీ చైర్మన్ రాజయ్య, సర్పంచ్ టేకు తిరుపతి, ఎంపీటీసీ రాజు, ఎంపీడీఓ రాముతో కలిసి ఎంపీపీ నిర్మల బుధవారం ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 2వ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ తిరుపతి తెలిపారు. వార్డ్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి రమేశ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణంలోని మూడవ వార్డులో బుధవారం పలు అభివృద్ధి పనులను నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నహీముద్దీన్, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అశోక్ గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ గొర్రె వెంకట్ రెడ్డి, జిల్లా కోఆప్షన్ మెంబర్ మన్సూర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబీబ్ ఖాన్, కౌన్సిలర్లు ఇష్రాత్ సిద్ధిక్, రామచందర్, బీఆర్ఎస్ నాయకులు కుమ్మరి నాగేష్ సాగర్ దాహుద్, తదితరులు పాల్గొన్నారు.

మండల బీజేపీ కార్యదర్శిగా పరశురాం



నవతెలంగాణ-చిన్నశంకరంపేట.

బీజేపీ మండల అధ్యక్షుడు పోగుల రాజు ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా చాకలి పరశురామ్, ఉపాధ్యక్షుడిగా బుర్కా దాసు, రాజు యాదవ్, కోశాధికారిగా రామ్ నరేష్ నియమించారు. వీరికి నియామాక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రాచర్ల అశోక్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి, దశరథం, జిల్లా బీజేవైఎం నాయకులు మధు, భూపాల్ తదితర నాయకులు పాల్గొన్నారు.

బాధితుడిని పరామర్శించిన జెడ్పీటీసీ



నవతెలంగాణ-నర్సాపూర్

శివంపేట మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త పిల్లి మధు గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న శివంపేట జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా బుధవారం పిల్లుట్ల గ్రామానికి వెళ్లి బాధితుడు పిల్లి మధును పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నరసింహారెడ్డి, అంజా గౌడ్, చింతల స్వామి, వెంకటేష్, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్‌ను కలిసిన పీఆర్‌టీయూ నాయకులు



నవతెలంగాణ-గజ్వేల్

జిల్లా ఆసుపత్రి గజ్వేల్ సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్ మర్యాదపూర్వకంగా బుధవారం కలిసి నూతన సంవత్సర డైరీ అందించిన పీఆర్‌టీయూ సిద్దిపేట జిల్లా శాఖ అధ్యక్షులు ఆదరాసుపల్లి శశిధర్ శర్మ గజ్వేల్ మండల శాఖ అధ్యక్షులు ఊడెం వేమారెడ్డిలు అందించి డాక్టర్ సాయికిరణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో ఉన్న ఉపాధ్యాయుల ఉద్యోగుల మెడికల్ బిల్లులు త్వరగా మంజూర య్యేట్లు చూడాలని వారు కోరారు. ఉపాధ్యాయ ఉద్యోగుల బిల్లులన్నీ త్వరగా పూర్తిచేసి పంపిస్తామని డాక్టర్ సాయికిరణ్ పీఆర్‌టీయూ నేతలకు హామీ ఇచ్చారు.



నవతెలంగాణ 4

సిద్దిపేట

గురువారం 02 ఫిబ్రవరి 2023

హాత్‌సే హాత్‌జోడోను విజయవంతం చేయాలి

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు చెర్ల పద్మ



నవతెలంగాణ-సిద్దిపేట

మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు హాత్‌సే హాత్ జోడో యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు చెర్ల పద్మ అన్నారు. బుధవారం డీసీసీ అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి ఆధ్వర్యంలో మహిళా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్లాక్, మండలాల కమిటీలు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఒక్క మహిళా కార్యకర్త కష్టపడి పని చేసి, కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థులను గెలిపించుకోవడంలో కీలకపాత్ర పోషించాలన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియమ్మకు, రాహుల్ గాంధీకి గిఫ్ట్‌గా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీనీ అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా నాయకులు బత్తుల మమత, స్వరూప, స్వప్న, రజిని, రాణి, లక్ష్మి పాల్గొన్నారు.

నియోజకవర్గానికి ఓ హరీశ్ ఉంటే చాలు

- ఎపీ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టుదల, చిత్తశుద్ధి, అంకితాభావంతో, అవిశ్రాంతంగా శ్రమిస్తూ, తన నియోజకవర్గాన్ని అభివృద్ధికి కేరాఫ్ అడ్రెస్‌గా మార్చిన హరీశ్ రావు లాంటి ఆదర్శ ప్రజాప్రతినిధులు నియోజకవర్గానికి ఒకరుంటే రాష్ట్ర రూపురేఖలే మారిపోతాయని ఎపీ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ కొనియాడారు. బుధవారం సిద్దిపేటలో ఓ శుభకార్యానికి హాజరైన సందర్భంగా కోమటి చెరువును సందర్శించి, బోటింగ్ చేశారు. అనంతరం తనను కలిసిన మీడియాతో మాట్లాడారు. కొన్నేళ్ల వ్యవధి తర్వాతా తాను ఈ రోజు సిద్దిపేట పట్టణాన్ని పర్యటించానని, అభివృద్ధిలో అప్పటి సిద్దిపేటకు, ఇప్పటి సిద్దిపేటకు పోల్చలేనంత తేడా ఉందన్నారు. అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించడంతో సిద్దిపేట రూపురేఖలు మారి పోయినట్లు తెలిపారు. ఆయన వెంట తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) నాయకులు కే. విరాహత్ అలీ, జిల్లా అధ్యక్షులు కే. రంగాచారీ, ప్రజాతంత్ర సంపాదకులు దేవులపల్లి అజయ్ తదితరులు ఉన్నారు.

దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి కొత్త ప్రభాకర్ రెడ్డితోనే సాధ్యం

- ప్రతి గ్రామ పంచాయతీకి సీసీ రోడ్ల నిర్మాణం

నవ తెలంగాణ-మిరు దొడ్డి

దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి ఎంపీ కొత్త పప్రభాకర్ రెడ్డితోనే సాధ్యమని ఆత్మ కమిటీ చైర్మన్ భాస్కరాచారి ఎంపీపీ గజ్జల సాయిలు జెడ్పిటిసి లక్ష్మీ లింగం అన్నారు.. దుబ్బాక నియోజకవర్గంలోని 145 గ్రామపంచాయతీలకుగానూ రూ.14.5 కోట్లు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీకి జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నామని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీకి రూ 10 లక్షల రూపాయలు మంజూరు చేయడం. హర్షించదగ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వల్లాల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ పోలీసు రాజులు, సర్పంచ్ బాలరాజు, సర్పంచులు బాల నరసింహులు, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

33 జీవోను రద్దు చేయాలి

- కేంద్ర ప్రభుత్వానికి మండల సీపీఐ(ఎం) పార్టీ డిమాండ్
- గుందారంలో సీపీఐ(ఎం) గ్రామశాఖ సమీక్షా సమావేశం



నవతెలంగాణ-బెజ్జంకి

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే 33 జీవోను వెంటనే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీపీఐ (ఎం) పార్టీ మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని గుండారంలో సీపీఐ(ఎం) పార్టీ గ్రామశాఖ సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్రం ప్రభుత్వం 29 కార్మికుల చట్టాలను 4 కార్మిక చట్టాలుగా తీసుకురావడంతో కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని తిప్పారపు శ్రినివాస్ సూచించారు. ఉపాధి హామీ కార్మికులకు సుమారు 200 రోజుల పనిదినాలు కల్పించి, జిల్లాలో ఈఎస్ఐ ఆస్పత్రి, పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు సృష్టించాలని సీపీఐ(ఎం)పార్టీ పక్షాన రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఎలుక సంపత్, గైండ్ల కొమురయ్య, వినయ్, రాజు, మహేష్, రాజయ్య, అజయ్, శ్రీనివాస్, అన్వేష్, సాయికిరణ్, మహేష్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

- అలయన్స్ క్లబ్ అధ్యక్షులు వెంకటరమణారెడ్డి



నవతెలంగాణ-మిరుదొడ్డి

విద్యార్థులు క్రమశిక్షణగా ఉండి ఉన్నత మార్గాన్ని ఎంచుకోవాలని అలయన్స్ వెంకటరమణ రెడ్డి జిల్లా గవర్నర్ రాజ మల్లయ్య గౌడ్, కూర అంతయ్యలు అన్నారు. బుధవారం మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఐడి కార్డులు, పరీక్ష ప్యాడ్లను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్య పట్ల నిర్లక్ష్యం వహించకుండా ఉన్నత మార్గాన్ని ఎంచుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు నేటి బాలలే రేపటి పౌరులుగా తీర్చిదిద్దవలసిన బాధ్యత విద్యార్థులపై ఉందని కొనియాడారు విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో 100% గుర్తింపు సాధించాలని కోరారు ఈ కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ సభ్యులు వైకుంఠం ఆత్మ రాములు , అల్వాల గ్రామస్తులు నితిన్ మధు ప్రసాద్ తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బెక్కల్ రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని బెక్కల్ రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఆలయ కమిటీ చైర్మన్ డైరెక్టర్లు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. బెక్కల్ రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగే ప్రమాణస్వీకారం కార్యక్రమానికి మద్దూరు ఎంపీపీ కృష్ణారెడ్డి, మద్దూరు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మేక సంతోష్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరు కావడంతో ఆలయ కమిటీ చైర్మన్ మన్నెం లింగారెడ్డి, డైరెక్టర్లుగా గొట్టపర్తి వెంకటయ్య, లాకావత్ రెడ్యా, బొల్లు సుధాకర్‌లతో ఆలయ ఈవో విశ్వనాథ శర్మ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దేవాలయాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి ఆదేశాల మేరకు బెక్కల్ రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. దేవస్థానం ఆలయ ప్రాంగణంలో ఎంపీపీ నిధులు రూ. 5 లక్షలతో సీసీ రోడ్లు వేస్తానని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు చొప్పరి వరలక్ష్మి సాగర్, బెక్కల్ దేవస్థానం మాజీ చైర్మన్ నల్లగొప్పుల రాములు, బీఆర్ఎస్ నాయకులు తాళ్లపల్లి బిక్షపతి గౌడ్, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పేద ప్రజలకు అందని ద్రాక్షగా కేంద్ర బడ్జెట్

- భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ కో కన్వీనర్ శివలింగ కృష్ణ



నవతెలంగాణ-గజ్వేల్

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి బడ్జెట్లో పేదలకు మొండి చేయి చూపిస్తుందని కరోనా కష్టకాలంలో అనేకమంది వలస కార్మికులు పేద మధ్యతరగతి ప్రజలు ఎన్ని రకాల ఇబ్బందులు పడ్డారో కేంద్రానికి ఇంకా కనిపించలేదని భారత కమ్యూనిస్టు పార్టీ గజ్వేల్ నియోజకవర్గం కో కన్వీనర్ శివలింగ కృష్ణ అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ అంకెల్లో లక్షల కోట్లుగా వేల కోట్లుగా చూపిస్తున్న ఈ దేశంలో ప్రజల జీవన విధానం మారలేదని ఆయన తెలిపారు. ఇది పేదల బడ్జెట్ కాదని కార్పొరేట్ బడ్జెట్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ నియోజకవర్గ కోశాధికారి చిక్కుడు రాజు, నాయకులు రామగల్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే జీవనశైలిలో మార్పులొస్తాయి

- మన ఊరు-మన బడి ప్రారంభంలో ఎమ్మెల్యే రసమయి
- ప్రయివేట్ పాఠశాల బస్ రాకుండ గ్రామస్తులు తీర్మానం చేయాలని సూచన
- గ్రామాభివృద్ధిలో యువత పాత్ర కీలకమైందని హితవు
- విద్యార్థుల సంఖ్యలేకుంటే పాఠశాలలు ఎత్తివేత





నవతెలంగాణ-బెజ్జంకి

చదువుతోనే మానవాళి జీవనశైలిలో మార్పులొస్తాయని.. ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో కల్పిస్తున్న సకల సౌకర్యాలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గుండారం గ్రామంలో మన ఊరు-మన బడి కార్యక్రమంలో పూర్తయిన ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా సకల హంగులతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి మన ఊరు-మన బడి కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రభుత్వం ఖర్చు చేస్తున్న నిధులు దుర్వినియోగమవకుండా గ్రామంలోని విద్యార్థులను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఊరంత మంది ఉన్న పాఠశాలలో విద్యార్థుల్లేరని.. విద్యార్థుల్లేని పాఠశాలలను భవిష్యత్తులో ప్రభుత్వం ఎత్తివేస్తుందన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రయివేట్ పాఠశాల బస్ గ్రామంలోకి రాకుండా గ్రామస్తులు తీర్మాణం చేసుకుని ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవాలని కోరారు. మనుషులు మారితే గ్రామ రూపురేఖలు మారుతాయని..యువత గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలన్నారు. మన ఊరు-మన బడి ద్వార సకల సౌకర్యాలతో రూపుదిద్దుకున్న ప్రభుత్వ పాఠశాలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత గ్రామస్తులందరిపై ఉందన్నారు. పాఠశాల ఆవరణంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి సెల్ఫీ తీసుకోవడంతో విద్యార్థులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల పునరుద్ధరణ పనులకు కృషి చేసిన రోడ్లు భవనాల శాఖ ఏఈ హరిప్రసాద్, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్, ఎస్ఎంసీ చైర్మన్, ప్రధానోపాధ్యాయుడు రామంచ రవీందర్‌ను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఎంపీ నిర్మల, జెడ్పీటీసీ కనగండ్ల కవిత, ఎఎంసీ చైర్మన్ రాజయ్య, సర్పంచ్ శెట్టి లావణ్య, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, ఎంపీటీసీ ఎలుక లత, ఎంపీడీఓ రాము, తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు, ఎంఈఓ పావని, కో ఆప్షన్ సభ్యుడు మహిపాల్ రెడ్డి, ఎఎంసీ, పీఏసీఎస్ డైరెక్టర్లు దీటీ రాజు, బాలనర్స్, ఉప సర్పంచ్ రాము, బీఆర్ఎస్ నాయకులు, పాఠశాల బోధన సిబ్బంది, విద్యార్థులు, గ్రామ ప్రజలు హజరయ్యారు.



అబ్బురపరచిన జెడ్పీటీసీ కంఠస్త పద్యం..

(అటజనికాంచె భూమిసురు డంబరచుంబి శిర స్సర జరీ
పటల ముహుర్ముహు ర్లుఠ దభంగ తరంగ మృదంగ నిస్వన
స్ఫుట నటనానుకూల పరిపుల్ల కలాప కలాపిజాలమున్
కటకచరత్ కరేణు కర కంపిత సాలము శీతశైలమున్)

అల్లసాని పెద్దన్న రచించిన పద్యాన్ని జెడ్పీటీసీ కనగండ్ల కవిత సమావేశంలో ఆలపించి పలువురిని అబ్బురపరచింది. కనీస సౌకర్యాల్లేని సమయంలో కష్టపడి చదివి పలువురు మహనీయులుగా పేరు ప్రఖ్యాతలు గడించారని..సకల సౌకర్యాలున్న ప్రభుత్వ పాఠశాలలను పిల్లల తల్లిదండ్రులు విస్మరించి నేడు ప్రయివేట్ పాఠశాలల బాట పడుతున్నారని జెడ్పీటీసీ కనగండ్ల కవిత అసహనం వ్యక్తం చేశారు. గత ఉమ్మడి అంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అరకొర సౌకర్యాలతో చదువులు సాగించామని..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సకల సౌకర్యాలు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడుతాయని ప్రభుత్వ పాఠశాలలను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసిల్దార్‌కు వినతి



నవతెలంగాణ-మద్దూరు

విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో తహసిల్దార్ భూపతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చేర్యాల డివిజన్ కార్యదర్శి సుద్దాల భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న రూ.3200 కోట్ల స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 5 నుంచి జరగబోయే రాష్ట్ర బడ్జెట్ సమావేశంలో విద్యారంగానికి 30% బడ్జెట్ కేటాయించాలని, కాస్మోటిక్ చార్జెస్ పెంచాలని, అద్దెభవనాల్లో కొనసాగు తున్న హాస్టల్ విద్యార్థు లకు నూతన భవనం నిర్మించాలని, ఖాళీగాఉన్న పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్రవ్యా ప్తంగా విద్యారంగం సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఎప్పటికీ పోరా డుతూనే ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు అరుణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-చేర్యాల

విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ అధ్యక్షులు ఆముదాల రంజిత్ రెడ్డి డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎస్.కె.ఆరిఫాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ అధ్యక్షులు రంజిత్ రెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్ షిప్‌లు, ఫీజు రియంబర్ మెంట్స్ విడుదల చేయాలని కోరారు. అసెంబ్లీ సమావేశాలలో విద్యా రంగానికి 30 శాతం బడ్జెట్ కేటాయించాలని, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని, హాస్టల్‌లకు సొంత భవనాలను నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో నవీన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచంలో దొంగిలించలేనిది విద్య ఒక్కటే

- పాఠశాలల మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం కృషి
- ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

ప్రపంచంలో దొంగిలించలేనిది ఏదైనా ఉంది అంటే విద్య ఒక్కటేనని ప్రతి ఒక్కరు విద్యను అభ్యసించాలని హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్ అన్నారు. బుధవారం హుస్నాబాద్ మండలంలోని కూచనపల్లిలో రూ. 14 లక్షలతో మన ఊరు మన బడి కార్యక్రమంలో అభివృద్ధి చేసిన ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన కోసం సీఎం కేసీఆర్ పాఠశాలల అభివృద్ధి చేపట్టారన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో కార్పొరేట్ పాఠశాల వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యమన్నారు. కిచెన్ షెడ్, టాయిలెట్లు, కాంపౌండ్ వాల్, అదనపు తరగతి గదులు, ఫర్నిచర్, డైనింగ్ హాల్ నిర్మాణం, భవనాలను మరమత్తు చేసి రంగులు వేయడం జరిగిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 1000 గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కేశిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీపీ లకావత్ మానస సుభాష్, ఎంపీడీవో కుమారస్వామి, ఎంఈఓ దేశి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంకల్పం నెరవేర్చే బాధ్యత అందరిపై ఉంది



నవతెలంగాణ-గజ్వేల్

ప్రభుత్వ సంకల్పం నెరవేర్చే బాధ్యత అందరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ విద్యాధర్, 2వ వార్డు కౌన్సిలర్ బొల్లేపల్లి బాలమణి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం 2వ వార్డులో ఇంటింటికి తిరుగుతూ కంటి సమస్యలు ఉన్నవారు కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొని పరిష్కరించుకోవాలని వివరించారు. కంటి వెలుగు కార్యక్రమం ప్రజలకు ఎంతో అవసరమని భావించిన సీఎం కేసీఆర్ 2వ విడత కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. కంటివెలుగు విజయవంతంగా కొనసాగుతుందని, చివరి రోజు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని వారు సూచించారు. మున్సిపల్‌లో రెండు వార్డులు పూర్తయినట్లు వారు పేర్కొన్నారు.

3న ఛలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-నంగునూరు

దళిత బంధు పథకంలో ఇల్లు, భూమి లేని వారిని గుర్తించి అర్హులైన వారికి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 3న నిర్వహించనున్న ఛలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ నంగునూరు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లింగాల నర్సింలు కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు దళిత బంధు పథకంలో ఇల్లు, భూమి లేనివారికి మొదటి ప్రాధాన్యత కల్పించాలని బుధవారం నంగునూరులో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 14న హైదరాబాద్ ఇంద్ర పార్కు వద్ద రాష్ట్రవ్యాప్తంగా లక్ష మందితో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏ ప్రభుత్వ పథకమైన భూమి, ఇల్లు, ఆస్తులు లేని వారికి చేరినప్పుడే ఆ పథకం ప్రయోజనం నెరవేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి దేవులపల్లి బొక్కల రాజు, కందికట్ల కిషన్, నాగిళ్ల రవీందర్, దమ్మ గళ్ళ బిక్షపతి, కందికట్ల సామెల్, దేవులపల్లి రాజకుమార్, దేవులపల్లి నితిన్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి మరువలేనిది

- జెడ్పీచైర్ పర్సన్ రోజా శర్మ ఎమ్మెల్సీ ఫార్క్ హుస్సేన్



నవతెలంగాణ-మిరుదొడ్డి

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలకు నూతన ఓరవడి నెలకొందని జెడ్పీ చైర్ పర్సన్ రోజా శర్మ, ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్ అన్నారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మన ఊరు మన బడి కార్యక్రమంలో నూతనంగా ఏర్పాటు చేసిన మౌలిక వసతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు కల్పించేలా సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో వసతులతో పాటు మెరుగైన విద్యాబోధన అందుతుందని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలను ఆశ్రయించకుండా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించాలని కోరారు. కెసిఆర్ అందజేస్తున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. రాబోయే పరీక్షల్లో విద్యార్థులు లక్ష్యంతో చదివి సిద్దిపేట జిల్లాకు మంచి పేరును తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సాయిలు, ఆత్మ కమిటీ చైర్మన్ భాస్కర చారి, జెడ్పిటిసి లక్ష్మీ లింగం, డీసీసీబీ డైరెక్టర్ వెంకటయ్య, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బాలరాజు, బాల నరసింహులు, కిష్టయ్య ఎంపీటీసీ నరసింహులు, సర్పంచ్ రాములు, అధికారులు పలువురు పాల్గొన్నారు.

సర్కార్ బడులలో నాణ్యమైన విద్యా బోధన

- ఎమ్మెల్యే రఘునందన్ రావు
- అడిషనల్ కలెక్టర్ ముజమిల్ ఖాన్



నవతెలంగాణ-మిరుదొడ్డి

సర్కార్ బడులలో నాణ్యమైన విద్యా బోధన అందుతుందని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు, అడిషనల్ కలెక్టర్ ముజమిల్‌ఖాన్‌లు అన్నారు. మెరుగైన వసతులతో నాణ్యమైన విద్యా బోధన అందించేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. బుధవారం అక్బర్‌పేట, భూంపల్లి మండలం రుద్రారం గ్రామంలో మన ఊరు-మనబడి కార్యక్రమంలో ఎన్నికైన పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన మౌలిక వసతులతో పాటు ఫర్నిచర్‌ను అడిషనల్ కలెక్టర్ ముజమిల్‌ఖాన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలన్న ఉద్దేశంతో సర్కారు పాఠశాలలో సకల వసతులు కల్పించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలకు దీటుగా వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించాలన్నారు. మెరుగైన విద్యా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలను పటిష్టం చేసేందుకు మూడు దశలలో పనులన్నీ పూర్తయ్యేలా లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. అధునాతన హంగులతో కూడిన పాఠశాలలు, బడి పిల్లల భవితకు బంగారు బాటలు వేసేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మల్లన్నగారి శాంతమ్మ ఎంపీటీసీ మంజులత ఉప సర్పంచ్ పరశురాములు ఏఎంసి డైరెక్టర్ రమేష్ గౌడ్, ఎంపీడీవో రాజిరెడ్డి సంతోష్‌తో పాటు ప్రజా ప్రతినిధులు, అధికారులు, బీజేపీ నాయకులు బిక్షపతి, దేవరాజు పలువురు పాల్గొన్నారు.

దుబ్బాక నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండాను ఎగరవేస్తాం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియోజకవర్గానికి చేసిందేమీ లేదు
నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి





నవతెలంగాణ-తొగుట

దుబ్బాక నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగర వేసి ఆత్మగౌరవ నినాదాన్ని నిలబెడతామని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా మాజీమంత్రి చెరుకు ముత్యం రెడ్డి ఆశయ సాధనకై దుబ్బాక ఆత్మ గౌరవ యాత్ర చేపట్టారు. పెద్ద మసాన్ పల్లి ఎల్లమ్మ ఆలయం వద్ద విజయ లక్ష్మి కాంగ్రెస్ పార్టీ జండా ఊపి శ్రీనివాస్ రెడ్డి చేపడుతున్న ఈ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లా డుతూ దేశంలో అసమానతలు, అనైక్యతను పోగొట్టేందుకు దేశంలో రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ప్రారంభించారన్నారు. దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి కోసం మాజీమంత్రి చెరుకు ముత్యం రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం నియోజకవర్గంలో పాదయాత్ర ప్రారంభిస్తున్నామన్నారు. నియోజకవర్గాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసమానతలకు గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ముత్యం రెడ్డి చేసిన అభివృద్ధి తప్ప ఎంపీ, ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి ఎక్కడ అని ప్రశ్నించారు. సిద్దిపేట, గజ్వేల్ నిర్వాసితులకు ఇచ్చినట్లు రూ.15 లక్షల పరిహారం మల్లన్నసాగర్ నిర్వాసితులకు ఆరు నెలల లోపు ఇప్పించకుంటే రాజీనామా చేస్తానని ప్రకటించిన ఎమ్మెల్యే రెండు సంవత్సరాలు గడిచినా ఎందుకు రాజీనామా చేయలేదని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియోజకవర్గాన్ని ఎప్పటికి న్యాయం చేయవని తెగేసి చెప్పారు. 2023 ఎన్నికల్లో దుబ్బాకలో కాంగ్రెస్ జెండా ఎగురవేసేవరకు ప్రతి ఒక్క రూ సైనికుల్లా పనిచేస్తారనే అభిప్రాయం వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి, ముత్యం రెడ్డి ఆశయ సాధన కోసం పోరాడతామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకు కొమ్మెర సీతా రాంరెడ్డి, జిల్లా నాయకులు గాంధారి నరేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు అక్కం స్వామి, రేపాక తిరుపతి, చిక్కుడు ఉప్పలయ్య, కొంగరి నర్సింలు, మండల, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వివాహ వేడుకలో పాల్గొన్న దయాకర్‌రెడ్డి

నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట పట్టణానికి చెందిన విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు పవన్‌గౌడ్ కూతురు వివాహ వేడుకలో బీజేపీ రాష్ట్ర నాయకులు, ప్రముఖ న్యాయవాది దయాకర్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతోపాటు గోపాల్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రాజేష్, స్వామి, మనోజ్‌రెడ్డి, మణికంఠ, నిఖిల్, యాదగిరి ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-సంగారెడ్డి

గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సంగారెడ్డి రూరల్ సీఐ శివలింగం తెలిపిన వివరాల ప్రకారం.. జనవరి 29న రాత్రి 9.30 గంటల సమయంలో సంగారెడ్డి నుంచి నర్సాపూర్ వైపు వెళ్లే బీటీ రోడ్డుపై ఓ గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. దీంతో అతనికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా మృతుడి వయస్సు 30 ఉంటుందని సీఐ తెలిపారు. బాధితుడి తలకు బలమైన గాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడన్నారు. అతని వద్ద ఎలాంటి గుర్తింపునకు సంబంధించిన ఆధారాలు లేవని పోలీసులు చెప్పారు. హనుమాన్ నగర్ సర్పంచ్ నేనావత్ మోహన్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. బాధితుడిని ఎవరైన గుర్తి పడితే 8712656746, 8712656719 నెంబర్‌లకు సమాచారం అందించాలన్నారు.



మడివాల విగ్రహానికి నివాళి

నవతెలంగాణ-న్యాల్‌కల్

మడివాల జయంతిని పురస్కరించుకుని మండలంలోని న్యాల్‌కల్, రామ్‌తీర్థం గ్రామాల్లో గల చౌరస్తాలో ఉన్న మడివాల విగ్రహానికి రజక సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు. ఆయన ఆశయాలు పాటిస్తూ ముందుకు సాగాలని రజక సంఘం నాయకులు పిలుపునిచ్చారు. రజక సంఘం అధ్యక్షులు ప్రభాకర్, న్యాల్‌కల్‌లో మల్లికార్జున్, అంజన్న , నర్సింలు, వాసు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నవతెలంగాణ-జహీరాబాద్



జహీరాబాద్ పట్టణంలోని అల్లానా బైపాస్ వద్ద బుధవారం రాత్రి 8 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. జహీరాబాద్ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి బసవనగర్ కాలనీకి చెందిన పి.వెంకటేష్(27) బుధవారం బంగ్లా మీర్జాపూర్‌లోని అమ్మమ్మ ఇంటికి వెళ్లి తిరిగి ప్రయాణ మయ్యాడు. అవెంజర్ టీఎస్07ఈడబ్ల్యూ4935 నెంబర్ గల వాహనంపై బీదర్ వైపు నుండి సంగారెడ్డి వస్తుండగా.. అల్లానా పరిశ్రమ వద్ద ఆర్టీసీ బస్సును క్రాస్ చేసే సమయంలో ఆటోకు తగిలి ఏపీ 15 జడ్ 0169 నెంబర్ గల ఆర్టీసీ బస్సు వెనుక టైర్ల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని జహీరాబాద్ కమ్యూనిటీ వైద్యశాలకు తరలించి.. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

నవతెలంగాణ-పుల్కల్



ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందుతున్నదని మండల విద్యాధికారి అంజయ్య అన్నారు. బుధవారం పుల్కల్ మండల పరిధిలోని గొంగ్లూర్ ఉన్నత పాఠశాలను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు, మౌలిక వసతులను కల్పిస్తున్నామన్నారు. అలాగే పాఠశాల నూతన భవనం అన్ని రకాల హంగులతో తీర్చిదిద్దడం జరిగిందన్నారు. విద్యార్థులు నేలపై కూర్చోకుండా నూతనంగా టేబుళ్ల ఫర్నిచర్ ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే వాటిని విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఇక్కడి ఉపాధ్యాయులు సిద్ధంగా ఉన్నారన్నారని.. కావున ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ లక్ష్మీ రాంచంద్రారెడ్డి, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జీ నిర్మాణంతో 25 రోజులు రోడ్డు బంద్



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణం నుంచి వెళ్లే జాతీయ రహదారిపై రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు శరవేగంగా కొనసాగడంతో 25 రోజుల పాటు రోడ్డును మూసివేస్తున్నట్టు ఆర్అండ్‌బి డిప్యూటీ నర్సింలు, పట్టణ ఎస్సై తెలిపారు. ఈనెల 1వ తేదీ నుంచి 25 వరకు ఈ రోడ్డుపై ప్రయాణికులను అనుమతించడం లేదన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే వాహనదారులకు తెలియపరిచా మన్నారు. మహారాష్ట్ర సత్వార్, చిరాకుపల్లి, ధనశ్రీ, మొగుడంపల్లి మండలాల నుంచి వచ్చే వాహనచోదకులు పాత ఆర్టీఏ చెక్‌పోస్ట్ వద్ద నుంచి రింగ్‌రోడ్డుపై నుండి జహీరాబాద్ పట్టణంలోకి రావాలన్నారు. ఇందుకు సంబంధించి రోడ్డుకు ఇరువైపులా బోర్డులను కూడా ఏర్పాటు చేశామన్నారు. పెద్ద వాహనదారులు రింగ్‌రోడ్డుతో పాటు బీదర్ నుంచి వచ్చే వాహనాలు అల్లాన పరిశ్రమ రోడ్డుపై నుండి జహీరాబాద్ పట్టణంలోకి వచ్చే విధంగా ఏర్పాటు చేశామన్నారు. 25 రోజుల పాటు ప్రయాణికులు సహకరిస్తే రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

మున్సిపల్ కార్మికులకు డబుల్ ఇండ్లు ఇవ్వాలి

నవతెలంగాణ-అమీన్‌పూర్



మున్సిపల్ కార్మికులకు డబల్ బెడ్ రూం ఇండ్లను కేటాయించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో అమీన్‌పూర్ తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించి.. తహశీల్దార్‌కు మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. అమీన్‌పూర్ మున్సిపల్‌లో 300 మంది కార్మికులు పని చేస్తున్నారన్నారు. వీరిలో 150 మంది గ్రామ పంచాయతీ వున్నప్పటి నుంచి గత 30 ఏండ్లుగా పనిచేస్తున్నారన్నారు. వీరందరూ ఎస్సీ, ఎస్టీ, బీసీ కుటుంబాలకే చెందిన వారే అన్నారు. కుటుంబాలు పెరగడంతో ఎక్కువమంది ఒకే ఇంట్లో ఇరుకైన గదుల్లో వుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీరంగూడ గుట్ట పక్కన నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇండ్లలో వారందరిని మొదట ప్రాధాన్యత క్రమంలో గుర్తించి ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని యెడల ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ కార్మిక నాయకులు జయరామ్, వెంకటమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడిని నిరసిస్తూ నేడు ఛలో హైదరాబాద్



నవతెలంగాణ-సంగారెడ్డి

ఉపాధ్యాయుడిపై మూక దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ.. నేడు చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం యూఎస్‌పీసీ పిలుపునిచ్చింది. గత నెలలో నిజామాబాద్ జిల్లా కోటగిరి హైస్కూల్లో పనిచేస్తున్న మల్లికార్జున్ అనే టీచర్ పై మూక దాడికి పాల్పడిన ఆర్ఎస్ఎస్, బజరంగ్ దళ్ నాయకులను వెంటనే అరెస్టు చేయాలని, ఇలాంటి దాడులు రాబోయే కాలంలో జరగకుండా నిలువరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో నేడు మధ్యాహ్నం 12 గంటలకు ధర్నా చౌక్ (ఇందిరాపార్క్) హైదరాబాదు వద్ద మహా ధర్నాను చేపట్టారు. ఈ ఈ ధర్నాలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ సంగారెడ్డి జిల్లా యూఎస్‌పీసీ నాయకత్వం డీఈవో కార్యాలయం వద్ద బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యూఎస్ పిసి జిల్లా నాయకత్వం బి. సాయిలు, నాగారం శ్రీనివాస్, అనుముల రామచందర్, పి. శ్రీనివాసరావు, భాస్కర్, సంజీవయ్య, బాలకృష్ణ, సింహాచలం నాగేశ్వరరావు, జనార్ధన్ మల్లికార్జున్, రామకృష్ణ, రవి, బాలయ్య జగన్మోహన్ పాల్గొన్నారు.

తారా డిగ్రీ కాలేజ్ విద్యార్థులకు సైబర్ క్రైం పై అవగాహన

నవతెలంగాణ-సంగారెడ్డి



సంగారెడ్డి పట్టణంలో గల తారా డిగ్రీ కాలేజ్ విద్యార్థులకు సైబర్ క్రైం, నేరాలపై బుధవారం పోలీసులు అవగాహన కల్పించారు. సంగారెడ్డి పట్టణ ఇన్‌స్పెక్టర్ అఫ్ పోలీస్ శ్రీధర్ రెడ్డి ఆదేశాలతో ముజీబుద్దిన్ ఎస్ఐపి , కానిస్టేబుల్ దత్తు, నయీం హెూంగార్డ్ ఇతర సిబ్బంది కలిసి విద్యార్థులకు 100 డయల్, సైబర్ క్రైమ్, హెల్ప్‌లైన్ -1930గురించి వివరించారు. అనవసర లింక్‌లపై క్లిక్ చేయొద్దని.. ఓటిపిలు ఇతర వ్యక్తులకు చెప్పొద్దని, వాట్సాప్, ట్విట్టర్, ఫేస్బుక్, హ్యాకింగ్ గురించి మరియు దుండగులు/అపరిచిత వ్యక్తులు, కామాందుల నుంచి ఎలా తప్పించుకోవాలి అని పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.



మన ఊరు-మనబడిలో పాఠశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-మునిపల్లి

మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా మునిపల్లి మండలంలోని మేళసంఘం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక పాఠశాలలను అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షురాలు శైలజ, జడ్పీటిసి సభ్యురాలు మీనాక్షి, భారాస రాష్ట్ర నాయకులు సాయికుమార్ మేళాసంఘం సర్పంచ్ శ్రీనివాస్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఖంరోద్దీన్, మండల విద్యాధికారి దశరథ్, మండల భారాస పార్టీ అధ్యక్షులు సతీష్ కుమార్, కోఆప్షన్ సభ్యులు సలాఉద్దీన్ ప్రధానోపాధ్యాయులు వీరన్న, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



జిన్నారం జీవన జ్యోతిర్లింగ ఆలయంలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన జీవన జ్యోతిర్లింగ ఆలయంలో బుధవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వామి మ్యాదరి శంకరయ్య, వేద పండితులు అనీల్ గురుస్వామి సారధ్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఎంపీటీసీ వెంకటేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు శ్రీనివాస్ రెడ్డి, పుట్టి భాస్కర్,ఉపసర్పంచ్ సంజీవ, సంగారెడ్డి జిల్లా బీజేపీ నాయకుడు ప్రతాప్ రెడ్డి,వార్డ్ సభ్యుడు శ్రీధర్ గౌడ్, బ్రహ్మేందర్గౌడ్, సీనియర్ జర్నలిస్ట్ ఆనంద్, మహేందర్ గౌడ్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.



కిచ్చినపల్లి హెచ్‌ఎంకు సన్మానం

నవతెలంగాణ-జోగిపేట

ఎఫ్ఎల్ఎన్ తొలిమెట్టు మండల స్థాయి బోధనాభ్యాసమాగ్రి గణితం మేళాలో ద్వితీయ స్థానం కిచ్చన్న పల్లి పాఠశాల కైవసం చేసుకఎంది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం అబ్దుల్ వహీద్‌ను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ కే. యదా గౌడ్, పంచాయతీ కార్యదర్శి మీనా, డీలర్ శ్రీశైలం, మాజీ చైర్మన్ సంతోష్ కుమార్, కోఆప్షన్ నెంబర్ దుర్గయ్య, మాజీ వార్డు మెంబర్లు వెంకయ్య, మానయ్య, యువకులు ప్రవీణ్ కుమార్, రాజేందప్రసాద్, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ డైరీ ఆవిష్కరణ



నవతెలంగాణ-పెద్దశంకరంపేట

అల్లాదుర్గం సీఐ జార్జ్, పెద్దశంకరంపేట ఎస్ఐ బాలరాజ్ చేతుల మీదుగా బుధవారం కేవీపీఎస్ డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ జార్జ్ మాట్లాడారు. దళిత గిరిజన చట్టాలతో డైరీ తీసుకరావడం అభినందనీయమన్నారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్, నాయకులు అరుణ్ కుమార్, రోమాల సాయిలు, శ్రీశైలం, బాలకృష్ణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ డైరీ ఆవిష్కరించిన ఎమ్మెల్సీ



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం గట్లమల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 2023 నూతన సంవత్సర పీఆర్టీయూ డైరీని ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలలో పీఆర్టీయూ కృషి చాలా ఉందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీఆర్టీయూ జనరల్ సెక్రెటరీ పంతం వెంకట రాజం, నంగునూరు మండల అధ్యక్షులు ఎర్ర పార్థసారథి, రాష్ట్ర నాయకులు సత్యనారాయణ రెడ్డి, నాగేష్, శనిగరం కనకయ్య, కొత్తపల్లి రవి, రామస్వామి, చిప్పదత్తాద్రి, ప్రధానోపాధ్యాయులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ప్రభాకర్‌రెడ్డితోనే దుబ్బాక అభివృద్ధి

నవ తెలంగాణ-రాయపోల్



దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డితోనే సాధ్యమవుతుందని రాయపోల్ సర్పంచ్ మౌనిక రాజిరెడ్డి అన్నారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం ప్రతి గ్రామ పంచాయతీకి రూ.10 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మంత్రి హరీశ్‌రావు దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నారన్నారు. రెండు సంవత్సరాలుగా దుబ్బాక నియోజకవర్గంలో ఏ అభివృద్ధి పని చేసినా బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు చేశారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవ తెలంగాణ-కొమురవెల్లి

మండలంలోని రసులాబాద్ గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించ తలపెట్టిన సీసీరోడ్డు పనులను సర్పంచ్ పచ్చిమడ్ల స్వామి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్, వార్డు సభ్యులు రాములు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు నిధుల మంజూరు హర్షణీయం

నవతెలంగాణ-దుబ్బాక రూరల్



దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామానికి సీసీ రోడ్డు మరమ్మతు పనులకు రూ.10 లక్షలు మంజూరు చేయడం హర్షణీయమని పద్మనాభునిపల్లి గ్రామ సర్పంచ్ కండ్లకొయ్య పరశురాములు అన్నారు. దుబ్బాక మండల కేంద్రంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎంపీ ప్రత్యేక శ్రద్ధతో నిధులు మంజూరు చేయించిన రాష్ట్ర ఆర్థిక ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

ఐడీ కార్డులు, టై, బూట్ల పంపిణీ



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల గట్ల మల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామ సర్పంచ్ తిప్పని రమేష్ ఐడీ కార్డులు, బూట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు గొప్పవని సర్పంచ్ పాఠశాలలు, విద్యార్థులపై శ్రద్ధ తీసుకొని వారికి కావాల్సిన సహకారం అందించిన దాతృత్వ హృదయానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వంతో పాటు ప్రజాప్రతినిధులు కూడా పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయం చేయడం వలన విద్యార్థుల భవిష్యత్తు చెక్కబడుతుందని తిప్పని రమేష్ ఆదర్శమన్నారు. కార్యక్రమానికి అధ్యక్షునిగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మండల ఉపాధ్యక్షురాలు కర్ణ కంటి రేణుక వేణుగోపాల్, ఉపసర్పంచ్ ఆనుమస్ ప్రకాష్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం వెంకటరాజం మండల అధ్యక్షులు ఎర్ర పార్థసారథి, రాష్ట్ర నాయకులు సత్యనారాయణ రెడ్డి, శనిగరం కనకయ్య, కొత్తపల్లి రవి, నాగేష్, ఉపాధ్యాయులు చిప్పదత్తాద్రి, రామస్వామి, లింగం, జీడిపల్లి సురేందర్ రెడ్డి, విజయకుమార్, రాంగోపాల్ రెడ్డి,రాములు,కిషన్,ఎస్ఎంసి చైర్మన్, హాస్టల్ వార్డెన్ రాజేశ్వరి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ట్రైడెంట్ యాజమాన్యం మొండి వైఖరి వీడాలి



నవతెలంగాణ-జహీరాబాద్

కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించకుండా ట్రైడెంట్ యజమాన్యం అవలంభిస్తున్న మొండి వైఖరిని వెంటనే విరమించుకోవాలని కార్మిక నాయకులు రాములు యాదవ్ అన్నారు. యాజమాన్య తీరును నిరసిస్తూ పరిశ్రమ గేటు ఎదుట వారు చేపట్టిన నిరసన కార్యక్రమం బుధవారం రెండోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రాములు యాదవ్ మాట్లాడుతూ.. పీఎఫ్, ఎల్ఐసి బకాయి డబ్బులు ఇచ్చేంతవరకు ఆందోళన విరమించేది లేదని కార్మికులు ఆందోళన కొనసాగిస్తుండగా.. వాయిదాల పద్ధతిలో బకాయలు చెల్లిస్తామని యాజమాన్యం చెప్పడం సరికాదన్నారు. సంవత్సర కాలంగా సుమారు రూ.2 కోట్ల బకాయిలుండగా.. కేవలం ఒక్క నెల పీఎఫ్ డబ్బులను యాజమాన్యం జమ చేసిందన్నారు. 12 నెలల పీఎఫ్ ఎల్ఐసి మొత్తం బకాయిలు చెల్లించేంతవరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. ఒప్పందం ప్రకారం చెల్లించాల్సిన బకాయిలు చెల్లించకుండా చక్కెర తరలించాలని చూస్తే అడ్డుకొని తీరుతామని స్పష్టం చేశారు. కాగా వారి నిరసనకు పలు పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలుపుతున్నారు. యాజమాన్య ప్రతినిధి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. బకాయి మొత్తం ఒకేసారి చెల్లించలేమని, వాయిదాల పద్ధతిలో చెల్లిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రైడెంట్ పరిశ్రమ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రూ.22 లక్షలతో పద్మనాభునిపల్లి ప్రభుత్వ పాఠశాల సుందరీకరణ





నవతెలంగాణ-దుబ్బాకరూరల్

'తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడులను బలోపేతం చేస్తూ.. కార్పొరేట్‌కు దీటుగా విద్యకు పెద్దపీట వేస్తోంది. సర్కార్ బడుల్లో చదివినవారంతా నేడు గొప్ప స్థాయిలో ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు చదువుకుంటేనే వారికీ ఉజ్వల భవిషత్ లభిస్తుంది' అని ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్, జడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజా రాధ కృష్ణ శర్మ, దుబ్బాక జడ్పీటీసీ కడతల రవీంద ్ర్ రెడ్డి అన్నారు. దుబ్బాక మండలం పద్మనాభునిపల్లి గ్రామంలో మన ఊరు-మనబడి కార్యక్రమంలో భాగంగా భవనాలను బుధవారం ప్రారంభించారు. నేటి పాఠశాలల ప్రారంభం చూస్తుంటే తాము చదివిన రోజులు గుర్తుకొస్తున్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 36 పాఠశాలలు ప్రారంభించుకున్నట్లు తెలిపారు. ,ఎంపీపీ కొత్త పుష్పాలత, ఎంపీటీసీ రామవరం మాధవి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చింత జ్యోతి, ఎంఈవో జోగు ప్రభుదాస్, ఎంపీడీవో భాస్కర శర్మ, సర్పంచ్ పర్శారాములు, ప్రధానోపాధ్యాయులు జానకీరామ్ సెక్రటరీ స్వామి, ఉపసర్పంచ్ మీస మల్లయ్య, వార్డ్ మెంబర్స్, దుబ్బాక వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రుద్రారం లింగం, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షురాలు హారిక

నవ తెలంగాణ-కొమురవెల్లి

రాష్ట్రంలో ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షురాలు అత్తిని హారిక డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ లక్ష్మీనారా యణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అత్తిని హారిక మాట్లాడుతూ విద్యారంగ సమస్యను పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.3,200 కోట్లు, స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం అమలు చేయాలన్నారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశంలో విద్యారంగానికి 30 శాతం బడ్జెట్ కేటాయించాలన్నారు. కాస్మోటిక్ చార్జీలు పెంచాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు నూతన భవనం నిర్మించాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల నాయకులు తాడూరి భరత్, తాడురి భాను పాల్గొన్నారు.

కుల బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

కక్ష పూరిత ధోరణితో తమ మూడు కుటుంబాలపై కక్ష కట్టి కుల బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సిద్దిపేట అర్బన్ మండలం వెల్గటూర్ గ్రామానికి చెందిన రజక కులస్తులు ఆలేటి కనకయ్య, ఆలేటి శివన్, ఆలేటి నాగరాజులు బుధవారం హైదరాబాద్‌లో మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో గత కొన్ని రోజుల నుంచి తమను కులంలోకి రానివ్వడం లేదని కుల సంఘానికి సంబంధించిన చిట్టి లెక్కలు తమకు చూపడం లేదన్నారు. తమ ఇంట్లో ఏ శుభకార్యం అయినా కులస్తులను రానివ్వకుండా కొంతమంది అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎక్కడ ఫిర్యాదు చేసిన ఎవరికి చెప్పిన మిమ్మల్ని కులం లోకి తీసుకోమని కొంతమంది బెదిరింపులకు గురి చేస్తున్నారని తెలిపారు.

పదవ తరగతి స్నేహితుల సన్మానం



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ గ్రామానికి చెందిన ముదిరాజ్ మండలాధ్యక్షులు రాగుల రాజుకు బీసీ రాష్ట్ర రత్న అవార్డు పొందిన సందర్భంలో చిన్ననాటి స్నేహితులు బుధవారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్ గౌడ్, మధుసూదన్, సత్యనారాయణ, బాల్చరి, సిద్దయ, వెంకటస్వామి, జానీ గణేష్, చంద్రయ్య, పెంటయ్య, రాజిరెడ్డి, కృష్ణమూర్తి, దత్తాద్రి తదితరులు ఉన్నారు.

అబద్ధాల పునాదులపై గోడలు కట్టడమే ఎమ్మెల్యే పని



నవ తెలంగాణ-దుబ్బాక

దుబ్బాక ఎమ్మెల్యే అబద్ధాల పునాదులపై గోడలు కట్టడమే పనిగా పెట్టుకున్నారని, ఉప ఎన్నికల్లో ఇచ్చిన హామీలైన రైతులకు రెండేడ్లు, నాగలి ఇంకెప్పుడు అందిస్తారో దుబ్బాక ఎమ్మెల్యే చెప్పాలని అచ్చుమాయిపల్లి ఉప సర్పంచ్ పర్స దేవరాజ్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు చేసిందేమి లేదని విమర్శించారు. ఎంపీ ప్రభాకర్ రెడ్డి సహకారంతోనే దుబ్బాక మండల వ్యాప్తంగా ప్రతి గ్రామ పంచాయతీకి ఎంజీఎన్ఆర్ఇజీఎస్ నిధులు రూ.10 లక్షలు మంజూరైనట్లు స్పష్టం చేశారు. నిధులు మంజూరు చేయించింది ఎమ్మెల్యే అయితే అందుకు ఆధారాలు చూపించి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకొని మంచి విద్యను అభ్యసించాలని హుస్నాబాద్ ఎంపీపీ లకావత్ మానస అన్నారు. బుధవారం హుస్నాబాద్ మండలంలోని జిల్లాలగడ్డ గ్రామంలోని గిరిజన వెల్ఫేర్ కళాశాలలో విద్యార్థులకు దుప్పట్లు ప్లేట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తుందన్నారు. ప్రతి హాస్టల్ లో విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి క్రమశిక్షణ నేర్పించాలన్నారు.

దుబ్బాక అభివృద్ధికి కేపీఆర్ ప్రత్యేక శ్రద్ధ

నవ తెలంగాణ-దుబ్బాక



దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి కోసం మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించారని, ఆయన సహకారంతోనే మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీకి ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ద్వారా రూ.10 లక్షలు మంజూరైనట్లు జెడ్పీటీసీ కడతాల రవీందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం దుబ్బాకలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కృషి, మంత్రి హరీశ్‌రావు మార్గదర్శకాలననుసరిస్తూ దుబ్బాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఎంపీ ప్రభాకర్ రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని చెప్పారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఆర్థిక,వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.

పోలీస్ ఆవుట్ పోస్ట్ ప్రారంభం

నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్



సిద్దిపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు వచ్చే ప్రజల సౌకర్యార్థం పోలీస్ అవుట్ పోస్టును ప్రారంభించినట్లు ఏసీపీ దేవారెడ్డి, మెడికల్ కాలేజ్ డైరెక్టర్ విమల థామస్ అన్నారు. బుధవారం సిద్దిపేట ప్రభుత్వ హాస్పిటల్ ఆవరణలో పోలీస్ అవుట్ పోస్ట్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ హాస్పిటల్‌కు వచ్చే ప్రజలు ఏవైనా సమస్యలుంటే పోలీస్ అవుట్ పోస్ట్‌లో నివృత్తి చేసుకోవాలని తెలిపారు. పోలీస్ అవుట్ పోస్ట్ లో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఇద్దరు కానిస్టేబుళ్లు 24 గంటలు విధులు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్ సూపరిడెంట్ డాక్టర్ కిషోర్, ఆర్ఎంఓ డాక్టర్ చంద్రశేఖర్, కౌన్సిలర్ సాయి, వన్ టౌన్ ఎస్ఐ నాగేశ్వరరావు, ఎస్ఐ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

వరి పొలాలను సందర్శించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

నవతెలంగాణ-నంగునూరు



నంగునూరు మండలంలోని నర్మెట, ఖానాపూర్ గ్రామాలలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ బృందం ఆధ్వర్యంలో బుధవారం వరి పొలాలను సందర్శించారు. శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పీజెటీఎస్ఎయూ శాస్త్రవేత్తలు ఎన్ఆర్జీ వర్మ, టి.కిరణ్‌బాబు, ఏఆర్ఎస్ తొర్నాల ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి, ఏరువాక శాస్త్రవేత్త విజయ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్, సిద్దిపేట సహాయ వ్యవసాయ సంచాలకులు పద్మ , నర్మెట గ్రామ సర్పంచ్ అజీజ్ , మండల రైతు బందు సమితి అధ్యక్షుడు బద్దిపడగ కిష్టారెడ్డి, ఎంపీటీసీ శనిగరం బాబు, మండల వ్యవసాయ అధికారి గీత, వ్యవసాయ విస్తరణ అధికారులు, భార్గవి, స్రవంతి, శిరీష, సాయి వర్మ, అశోక్, ప్రేమ్ సాగర్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

నవ తెలంగాణ-రాయపోల్



ప్రమాదవశత్తు చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన రాయపోల్ మండలం ఆరేపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఆరేపల్లి గ్రామానికి చెందిన కొంపల్లి బాలయ్య(48) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారి బంధువు ఇటీవల మృతి చెందగా దశదినకర్మ సందర్భంగా అందరూ కలిసి గ్రామంలోని చెరువులో స్నానాలు చేయడానికి వెళ్లారు. చెరువులో దిగి స్నానం చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు బాలయ్య నీట మునిగిపోయాడు. అక్కడే ఉన్న కొందరు బాలయ్యను రక్షించడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్లను రప్పించి బాలయ్య కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బాలయ్య మృతదేహం జేసీబీ గుంతలో లభించింది. అనంతరం మృతుదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు కొంపల్లి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలు

జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

నవతెలంగాణ-గజ్వేల్



ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ప్రశాంతి జీవన్ పాటిల్ అన్నారు. బుధవారం మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా గజ్వేల్ మండలం పిడిచెడు, బిజీగామ గ్రామాల్లో మన ఊరు మనబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మన ఊరు మనబడి కార్యక్రమం తీసుకుందన్నారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ నేతృత్వంలో ప్రభుత్వ పాఠశాలల స్వరూపాన్ని సమగ్రంగా మార్చే లక్ష్యంతో ముందుకు వెళ్తుందన్నారు. దశలవారీగా అన్ని ప్రభుత్వ పాఠశాలల మార్పు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివి మన ఊరు మన బడికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, ఎఫ్డిసి చైర్మన్ ఒంటేరు ప్రతాపరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఆత్మ కమిటీ డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, ఎంపీపీ అమరావతి, జడ్పిటిసి మల్లేశం, మండల విద్యాధికారి సునీత పాల్గొన్నారు.

సర్కారు బడులకు మహర్దశ

నవతెలంగాణ-వర్గల్



గ్రామీణ విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుతం మన ఊరు-మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వర్గల్, గుంటిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో కలిసి వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని భావించిన సీఎం కేసీఆర్ విద్యకు పెద్దపీట వేస్తూ అన్ని రకాల వసతులు కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్రంలో దశలవారీగా ప్రభుత్వ బడులను 12 రకాల వసతులతో ఆధునికరిస్తున్నామని, విద్యార్థులు ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బడులలో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవడంతో పాటు వర్గల్, గుంటిపల్లి, మజీద్‌పల్లి, తునికికాల్స తదితర పాఠశాలలలో మౌలిక వసతులు కల్పిస్తూ నూతన భవనాల నిర్మాణం, వాటికి మరమ్మతులు, ప్రహరీ నిర్మాణం, తాగునీటి వసతులు, మరుగుదొడ్ల ఏర్పాటు, కిచెన్ షెడ్ల నిర్మాణం తదితర వసతుల కల్పనకు సర్కార్ నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. కార్యక్రమాలలో సర్పంచులు గోపాల్‌రెడ్డి, హనుమంతు, గడ స్పెషల్ ఆఫీసర్ ముత్యం రెడ్డి, జెడ్పీటీసీ బాలు యాదవ్, ఎంపీపీ అధ్యక్షులు లతా రమేష్‌గౌడ్, వైస్ ఎంపీపీ బాల్ రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వేలూరి వెంకట్ రెడ్డి, మాజీ అధ్యక్షులు నాగరాజు, నాచగిరి ఆలయ డైరెక్టర్ పడిగే రాజు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, బీసీ సెల్ అధ్యక్షులు మురళి గౌడ్, తహసీల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీవో మేరీ స్వర్ణకుమారి, ఎంఈఓ సునీత, ఎస్ఎంసీ చైర్మన్ మామిండ్ల మల్లేష్ పాల్గొన్నారు.

3న కూడవెల్లి వాగులోకి గోదావరి జలాలు విడుదల: ఎఫ్డీసీ చైర్మన్

నవతెలంగాణ-గజ్వేల్



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర వైద్య ఆరోగ్య ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు కృషితో ఈ నెల మూడవ తేదీన కూడవెల్లివాగులో మల్లన్న సాగర్ కాలువ నుంచి కాలేశ్వరం గోదావరి జలాలను వదులుతామని ఎఫ్డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం సీఎం క్యాంప్ ఆఫీసులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూడవెల్లివాగును నమ్ముకుని కొందరు పెద్ద ఎత్తున వరి నాట్లను ప్రతిసారి వేస్తున్నట్లు చెప్పారు. వరి చేను పొట్టకొచ్చిన సమయంలో వాగులోకి నీళ్లు రాక పంటలు ఎండిపోయే పరిస్థితిలో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ కాలేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా మల్లన్నసాగర్‌లోకి గోదారి జలాలను తరలించామన్నారు. మల్లన్న సాగర్ కెనాల్ నుంచి కొడకండ్ల వద్ద మండుటెండల్లో సైతం రైతులు నష్టపోకుండా, పంటలు ఎండిపోకుండా భరోసానిస్తూ పొలాల్లో గోదావరి జలాలను పారించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నారు. కూడవెల్లివాగు ద్వారా గజ్వేల్ మండలంలోని కొడకండ్ల, రిమ్మనగూడ, బూరుగుపల్లి, సింగాటం, అహ్మదీపూర్ గ్రామాలలోని చెక్‌డ్యాంలన్నీ నింపి పొలాలకు నీళ్లను అందిస్తామన్నారు. బీడువారిన పొలాలు సస్యశ్యామలంగా మారాయన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సరఫరా చేయడం, రైతు వేదికల నిర్మాణం లాంటి ఎన్నో సంక్షేమ, అభివృద్ధి ఫలాలను రైతులకు ముఖ్యమంత్రి కేసీఆర్ అందిస్తున్నట్లు తెలిపారు.

ఉపాధి హామీ పథకం ఎత్తివేతకు బడ్జెట్‌లో కొతలే నిదర్శనం

నవతెలంగాణ- గజ్వేల్



పేదలకు ఆహార భద్రత, అదాయం కల్పిస్తున్న ఉపాధి హామీ పథకానికి కేంద్రం బడ్జెట్‌లో నిధులు తగ్గించి పథకాన్ని ఎత్తి వేయడానికి కుట్ర చేస్తోందని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ ఆరోపించారు. బుధవారం కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఆయన మాట్లాడుతూ దేశంలో కూలీలకు పనులు కల్పించేందుకు రూ.3 లక్షల కోట్లు అవసరం వుండగా రూ.35 వేల కోట్లను మాత్రమే కేటాయించిందన్నారు. 2022-23 బడ్జెట్ లో రూ.73 వేల కోట్లు కేటాయించి, సవరించిన బడ్జెట్‌లో రూ.89,400 వేల కోట్లను కేటాయించగా, 2023-24 బడ్జెట్‌లో రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. గత బడ్జెట్ కంటె ఇది రూ.28,600 వేల కోట్లను తగ్గించిందన్నారు. ప్రస్తుతం కేటాయించిన రూ.60 వేల కోట్లలో రూ.16 వేల కోట్లు తక్షణ బకాయిలకు, మరో రూ.25 వేల కోట్లు ప్రభుత్వ అంచనా ప్రకారం ఈ సంవత్సరం బకాయిలకు పోగా ఇక మిగిలింది రూ.35 వేల కోట్లు దేశంలో కొట్లాది మందికి కూలీలకు ఏ మూలకూ సరిపోదన్నారు. తెలంగాణ, బెంగాల్ తదితర రాష్ట్రాలలో అవినీతి జరుగుతుందనే సాకుతో నిధులను సకాలంలో విడుదల చేయకుండా చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ఉల్లంఘిస్తోందన్నారు. పేదల వ్యతిరేక కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించి పని హక్కుల పరిరక్షణకు ఉద్యమిస్తామన్నారు.

పుస్తె మెట్టల పంపిణీ

నవ తెలంగాణ-సిద్దిపేట



వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో దాత గంప మురళయ్య జ్ఞాపకార్థం వారి మనవరాలు రంగ అర్చన-భాస్కర్ సహకారంతో భార్గవి వివాహ సందర్భంగా పుస్తె మెట్టెలు, చీర అందజేసినట్లు వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ గంప కృష్ణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు చింత రాజేంద్రప్రసాద్, కార్యదర్శి చకిలం రవి, పి ఆర్ ఓ అయిత శంకర్ , వాసవి యూత్ క్లబ్ అధ్యక్షుడు అర్వపల్లి హరికిరణ్, కార్యదర్శి చొక్కారపు శ్రీధర్ , జూలూరి శ్రీనివాస్, చిగుళ్లపల్లి సత్యానారాయణ పాల్గొన్నారు.

క్రికెట్లో సత్తా చాటిన విద్యార్థి

నవతెలంగాణ -గజ్వేల్

కేరళ రాష్ట్రంలో జరుగుతున్న అండర్ 14 కృష్ణమూర్తి టోర్నమెంట్ స్మారక సౌజోన్ క్రికెట్ పోటీల్లో గజ్వేల్ పట్టణానికి చెందిన ఇషాంత్ ప్రేమ చరణ్ సత్తా చాటారు. క్రికెట్ టోర్నమెంట్‌లో ఇషాంత్ ప్రేమ చరన్ మిగతా క్రీడాకారులకు చుక్కలు చూపించారు. అక్కడ జరుగుతున్న క్రీడల్లో సిద్దిపేట జిల్లా గజ్వేల్ పేరును మారుమోగిస్తున్నారు. దీంతో ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, ఎఫ్డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి, ఆత్మ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, గజ్వేల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు హరిచంద్ర ప్రసాద్, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎంతోమంది జీవితాలలో వెలుగులు

నవతెలంగాణ-నంగునూరు

కంటి వెలుగు కార్యక్రమం ఎంతో మంది జీవితాలలో వెలుగులు నింపిన ఈ పథకం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల నాయకులు గంధమాల ధన్‌రాజ్, యాదగిరి ప్రకటించారు. బుధవారం నంగునూరు మండలంలోని నర్మెట గ్రామంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి హాజరయ్యారు. డా.శివారెడ్డి, డా.అంజలి, గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్ రెడ్డి, హేమలత, నాగ లక్ష్మి, లింగం గౌడ్, మహేందర్ గౌడ్, పద్మ, స్వరూప, ఉత్తెర తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బలోపేతమే లక్ష్యంగా పని చేద్దాం

నవ తెలంగాణ-దుబ్బాక, దుబ్బాక రూరల్

మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ రెడ్డి నాయకత్వంలో దుబ్బాక మండలంలోని గ్రామ గ్రామాన బీఆర్ఎస్ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని బీఆర్ఎస్ దుబ్బాక మండల అధ్యక్షుడు బాణాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. దుబ్బాక మండల పరిధిలోని గంభీర్‌పూర్ గ్రామంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాణాల శ్రీనివాస్, సీనియర్ నాయకులు కొత్త కిషన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శేర్ల కైలాష్, గ్రామ సర్పంచ్ కరికే భాస్కర్‌ల సమక్షంలో బూత్ కమిటీలను బుధవారం ఎన్నుకున్నారు. మొదటి బూత్ అధ్యక్షుడిగా మిద్దె జాను (నరసింహులు), కోకన్వీనర్‌గా దోర్నాల స్వామి, మహిళా విభాగం కన్వీనర్‌గా లచ్చగారి మాధవి, 2వ బూత్ అధ్యక్షుడిగా రెడ్డి రామ్ రెడ్డి, కన్వీనర్‌గా చింతు గణేష్, మహిళా విభాగం కన్వీనర్‌గా బుచ్చగారి స్వప్నలను ఎన్నుకున్నారు.

నిధులు విడుదల పట్ల హర్షం

నవ తెలంగాణ-రాయపోల్

గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని, బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి జరుగుతుందని రాయపోల్ ఎంపీపీ కల్లూరి అనిత శ్రీనివాస్ అన్నారు. గ్రామాల అభివృద్ధికి పది లక్షల రూపాయల చొప్పున నిధులు విడుదల చేయడం హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్ రావుల సహకారంతో ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి నిరంతరం ప్రజా సమస్యలను తెలుసుకుంటూ గ్రామాల అభివృద్ధి కోసం బాటలు వేస్తున్నారు.

హాఫ్ మారథాన్ రన్నింగ్ ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

ఈనెల 12న హుస్నాబాద్ లో రన్నింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టే హాఫ్ మారతాన్ రన్నింగ్ ను ఉత్సాహవంతులైన యువతీ యువకులు పాల్గొని విజయవంతం చేయాలని హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్ అన్నారు. బుధవారం హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో హాఫ్ మారతాన్ రన్నింగ్ పోస్టర్ ను ఎమ్మెల్యే సతీష్ కుమార్ ఆవిష్కరించారు.